J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 05.06.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 01 పేజీలు : 12, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## జగన్ నిర్ణయాలకు..

# కళ్ళాలేస్తున్న కోర్టులు



- సమన్వయ లోపమా.. ప్రభుత్వానికి శాపమా?
- వై.యస్. హయాంలో ఇలా జరిగేది కాదు!

***భారతదేశంలోనే ప్రప్రథమంగా ఇప్పటివరకూ ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యంత ప్రజాదరణ పొందిన ఒక మాజీ ముఖ్యమంత్రి కొడుకుగా అనూహ్యమైన ప్రజాభిమానం పొంది, దశాబ్దకాలం పాటు అలుపెరుగని పోరాటంచేసి 175కి గాను 151 సీట్లు సాధించిన ఘన చరిత్ర ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డిది.***

మాట తప్పని, మడమ తిప్పని ప్రజా సేవకుడిగా ధీరోదాత్త లక్షణాలు కలిగిన నాయకుడిగా తనను తాను రుజువుచేసుకోవడానికి తన తండ్రికి 3 దశాబ్దాలు పడితే... ఈ కొడుకు ఆ నమ్మకాన్ని, విశ్వాసాన్ని 10 సంవత్సరాలలోనే సాధించాడు. తాను స్థాపించిన వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ వేదికగా, జగన్మోహన్‌రెడ్డికి ఆంధ్ర ప్రజలు ఏకపక్షంగా ఓట్లు వేసి 2019 ఏప్రియల్ 11వ తేదీన తమ తీర్పును ఇచ్చి (మిగతా 11వ పేజీలో)

## కరోనా కట్టడిలో...

# మనమే మేలు



**అక్కడ మాటల మూట**

**ఇక్కడ ఆచరణ బాట**



- నియంత్రణలో కేరళ తర్వాత ఏపి
- తెలంగాణలో పెరుగుతున్న కేసులు

తెలంగాణ సీఎం కేసీఆర్‌కు మాటలెక్కువ... వాక్చాతుర్యంలో కొట్టినపిండి, మాటలతోనే తిమ్మిని బమ్మిని చేయగలడు. కరోనా వైరస్ విషయంలో రెండురోజుల తేడాలోనే ఆయన రెండు రకాలుగా మాట్లాడాడు. బ్లీచింగ్ పౌడర్, పారాసిటామాల్ గోలీతో కరోనాను తరమొచ్చని చెప్పిన ఆయన, రెండోరోజే మాటమార్చి బ్రతికుంటే బలుసాకు తిందాం, లాక్‌డౌన్‌ను పాటించి కరోనాను కట్టడి చేద్దామంటూ పిలుపునిచ్చాడు. కరోనా వైరస్ మీద కత్తి తిప్పినట్లు, తెలంగాణ నుండి దాన్ని తన్ని తరిమేస్తున్నట్లు ఆయన మాటలు కోటలు దాటాయి. తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటెల రాజేందర్ అయితే... కరోనా వైరస్ కట్టడిలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైనట్లు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విఫలమైనట్లుగా వ్యాఖ్యలు చేశాడు.

నిజమే, కేసీఆర్‌లా ఏపి సీఎం జగన్ మాటకారి కాదు, చలోక్తులు విసురుతూ ప్రజలను మెప్పించే విధంగా మాట్లాడలేడు. చాలామంది మేధావులు కూడా ఈ మాటల తేడాకు పడిపోయే కరోనా వైరస్ విషయంలో కేసీఆర్ బ్రహ్మాండంగా పనిచేస్తున్నాడని, జగన్ ఆయనలా చేయలేకపోతున్నాడని కూడా అనుకున్నారు.

కాని ఇప్పుడేమైంది... కరోనా కట్టడిలో కేరళ రాష్ట్రం తర్వాత ఆంధ్రప్రదేశే (మిగతా 11వ పేజీలో)

## 39 యేళ్ళుగా

# అదే ఆదరణ...

ఒక పత్రిక ఎంత పురాతనమైనది అన్నది ముఖ్యం కాదు... ఆ పత్రికకి ఎంతటి ప్రజాదరణ వుంది అది ఏ స్థాయిలో ప్రజామోదయోగ్యత పొందింది అన్నదే ప్రధానం. గత 39 సంవత్సరాల కాలంలో పైరెండూ పుష్కలంగా పొందగలిగింది మా(మీ) లాయర్ వారపత్రిక.

నిష్పక్షపాత వార్తలతో ప్రజలపక్షాన నిలిచే వార్తా పత్రికగా నెల్లూరీయుల ప్రియ పుత్రికగా లాయర్ వార పత్రిక పాఠకుల గుండెల్లో పదిలమైన స్థానాన్ని పొందింది.... కాబట్టే 39సంవత్సరాలు గడిచినా ఈ నాటికీ నెల్లూరీయుల హృదయాంతరాల్లో పవిత్రంగా నిలిచిపోయింది.

వారం వారం క్రమం తప్పకుండా ప్రపంచ వ్యాప్తంగా వున్న లక్షలాదిమంది నెల్లూరీయుల తలుపుతట్టి, నిత్యం వారి తలపుల్లో మెదులుతూనే వారి అభిమానాన్ని సంపాదించుకుంది. ఇది మా పత్రిక, మా నెల్లూరు పత్రిక, అని ప్రతి నెల్లూరీయుడూ సగర్వంగా చెప్పుకునేలా అంతర్జాలం ద్వారా తన ఉనికిని చాటుకుంటోంది. మా(మీ) లాయర్.

లాయర్ పత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి గారు అందించిన చైతన్యస్ఫూర్తితో, ఆయన ఆశయసాధనలో వారం వారం నిరంతర అక్షర సమరాన్ని సాగిస్తూ, ఈరోజు (జూన్ 5, 2020)న 40వ పడిలో అడుగిడింది, సెల్‌ఫోన్ల ద్వారా యు ట్యూబ్ చానళ్ళు, వాట్సాప్ వార్తలు క్షణం క్షణం పాఠకులని, వీక్షకులని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న తరుణంలో సైతం వారానికి ఒక్కసారి పలకరించే లాయర్‌ను ఇది మా పత్రిక అంటూ అక్కున చేర్చుకుని ఆశీర్వదిస్తున్న లాయర్ ఆత్మబంధువులందరికీ హృదయపూర్వక నమస్సుమాంజలి. నాటికీ, నేటికీ, ఏనాటికీ మీ వెంట మేమున్నాం అంటూ లాయర్‌ని ముందుకు నడిపిస్తున్న ఎందరో మహానుభావులు.. అందరికీ వందనాలు తెలుపుకుంటూ... ఇదే ఆదరణ, అభిమానం కలకాలం వుండాలని మనసారా అభిలషిస్తూ...

యావత్ ప్రపంచాన్ని కలవర పెట్టి కల్లోలం సృష్టిస్తున్న కరోనా మహమ్మారి వ్యాధి నుండి సాధ్యమైనంత త్వరలో మానవాళికి విముక్తి కలగాలని కోరుకుంటూ....


**సర్వేజనాః సుఖినోభవంతు!**

సం/-

## పేరుకు పరామర్శ...

# చేసింది విమర్శ!

- బాబు పర్యటన నిర్వాకం
- మాటల్లో బిల్డప్..
- ఆచరణలో హ్యాండ్సప్



విశాఖపట్నంలో ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన జరిగినప్పుడు తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు హైదరాబాద్ నుండి నానా రాద్ధాంతం చేశాడు. గ్యాస్ లీక్‌కు జగన్ కారణమన్నట్లు మాట్లాడాడు. నేనైతే ఎల్‌జి పరిశ్రమలోకే పోయి గ్యాస్ లీక్‌ను ఆపి వుండేవాడినన్నాడు. తెలుగుదేశం శ్రేణులు కూడా... అడుగో చంద్రబాబు... ఇప్పుడే రోడ్డు మార్గాన బాధితులను పరామర్శించడానికి విశాఖకు బయల్దేరుతున్నాడని డప్పుకొట్టాయి. 'ఊపిరి పీల్చుకో విశాఖ' అంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు కూడా పెట్టారు. ఇంతా చేస్తే సంఘటన జరిగినరోజు గాని ఆ పక్కరోజు కూడా చంద్రబాబు విశాఖకు రాలేదు.

వారంరోజుల తర్వాత తెలంగాణకు, ఆంధ్రకు పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు... విశాఖపట్నం వెళ్లి ఎల్.జి (మిగతా 11వ పేజీలో)

## బతుకుతెరువు కోసం వస్తే..

# వ్యభిచార కూపంలోకి దించారు

**- జిల్లా పోలీసుల చొరవతో ఎట్టకేలకు ఓ బాలికకు విముక్తి**



***బాలికలు, మహిళల రక్షణకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, నేరస్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటున్నా ఇంకా కొంత మందిలో ఎలాంటి మార్పు ఉండడం లేదు. కనీస మానవత్వం కూడా మరిచి ఓ బాలిక పట్ల ఇటీవల గత కొంతకాలంగా కొందరు అమానుషంగా ప్రవర్తిస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. తాజాగా నెల్లూరుజిల్లాలో ఈ వ్యవహారమంతా బయటపడింది. జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ ఆదేశాలతో ఆ బాలికకు ఎట్టకేలకు వ్యభిచార ముఠా వలయం నుంచి విముక్తి కలిగింది.***

బతకడానికి ఏదైనా పనిచూపమని అడిగితే, ఎక్కువ డబ్బులు వస్తాయంటూ ఆశచూపి అభం శుభం తెలియని ఆ బాలికను నమ్మించి, చివరికి వ్యభిచార కూపంలోకి దించి తమ పైశాచిక ప్రవృత్తిని చాటుకున్నారు.. కొందరు ముష్కరులు. అయితే, నెల్లూరు పోలీసుల చొరవతో ఎట్టకేలకు ఆ బాలిక ఆ నరకయాతన నుంచి బయటపడింది. నెల్లూరు రూరల్ డిఎస్పీ హరినాథ్‌రెడ్డి గతనెల 31న విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి ఆ ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను తెలియజేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి. తెలంగాణలోని నిజామాబాద్ ప్రాంతానికి చెందిన ఓ బాలిక తండ్రి తమ కుటుంబాన్ని వదిలేసి వెళ్ళిపోవడంతో, ఆ కుటుంబానికి పూటగడవని దుస్థితి ఏర్పడింది. దీంతో బతుకు తెరువు కోసం ఆ బాలిక విజయవాడలోని తన బంధువు ఇంటికి వచ్చింది. అక్కడ రామకృష్ణ అలియాస్ కృష్ణ, సోనీ దంపతులు పరిచయమయ్యారు. వారికి తన కష్టాలను వివరించి ఏదైనా పనిచూపమని ఆ బాలిక ప్రాధేయపడితే, తాము చెప్పినట్లు వింటే ఆర్థిక ఇబ్బందులు పోతాయని వారు నమ్మబలికి ఆ బాలికను వ్యభిచారం కూపంలోకి దించారు. ఈ క్రమంలో గత జనవరిలో ఆ బాలికను నెల్లూరుకు తీసుకువచ్చి హరనాధపురంలో ఓ అపార్ట్‌మెంట్‌లో ఉన్న లావణ్య, ఆమె తమ్ముడు పృధ్వి, మరిది వినయ్‌కు అప్పగించగా, వారు ఆ బాలికను తమకు తెలిసిన వారి వద్దకు పంపి సొమ్ము చేసుకోవడం ప్రారంభించారు. బాలికకు మాత్రం డబ్బులిచ్చేవారు కాదు. తన తల్లి వద్దకు వెళ్తానని బాలిక ఎంతగా ఏడ్చి మొత్తుకున్నా వారు వినేవారు కాదు. ఈ క్రమంలో గతనెల 29న ఆ బాలికను వారు ఇందుకూరుపేట మండలంలోని విటుల వద్దకు తీసుకువెళ్ళగా ఆ బాలిక ఎలాగో తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ వెంటనే స్పందించి పోలీసులను రంగంలోకి దింపడతో అసలు కథంతా బయటపడింది. ఈ కేసుకు సంబంధించి విటులతో పాటు నిర్వాహకులను కొరుటూరు గ్రామం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారని డిఎస్పీ వివరించారు. నిందితులు కడియాల లావణ్య, కొత్తపల్లి పృధ్వీరాజ్, యు.వినయ్‌కుమార్, రెవెన్యూ ఉద్యోగి కొనెట్టి శ్రీనాధ్‌లను అరెస్ట్ చేశామని డిఎస్పీ తెలిపారు. బాలికను వ్యభిచార కూపంలోకి దింపిన బావిశెట్టి రామకృష్ణ, షేక్ సోనీలు పరారీలో ఉన్నారని, పూర్తిస్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందని ఆయన వివరించారు. ఈ కేసులో ప్రతిభ చూపి నిందితులను గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్న సి.ఐ కె.రామకృష్ణ, ఎస్ఐ పి.నరేష్‌తో పాటు పోలీసు సిబ్బందిని డిఎస్పీ అభినందించారు.

### షార్ ఇన్‌చార్జి కంట్రోలర్‌గా

## కుంభకర్ణన్

షార్ ఇన్‌చార్జి కంట్రోలర్‌గా వి.కుంభకర్ణన్ గతనెల 29న బాధ్యతలు తీసుకున్నారు. ఈయన మేనేజ్‌మెంట్ సిస్టం ఏరియా డెప్యూటి డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి కంట్రోలర్‌గా ఉన్న రంగరాజన్ పదవీ విరమణ చేశారు.

## రేషన్ బియ్యం స్వాధీనం

నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం సమీపంలోని ఎస్వీకేసీ రైస్ మిల్లులో 21టన్నుల 660 రేషన్ బియ్యం బస్తాలను రూరల్ ఎస్సై నాగార్జునరెడ్డి సిబ్బందితో కలిసి గతనెల 31న స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు ఆయన రైస్ మిల్లుపై దాడి చేసి లారీలోని రేషన్ బియ్యం బస్తాలను కూలీలు కిందికి దించుతుండగా దాడి చేశారు. రైస్ మిల్లు యజమాని సత్యనారాయణ, లారీ డ్రైవర్ పరారయ్యారు. అనంతరం 660 రేషన్ బియ్యం బస్తాలు, లారీని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏడాది పాలనలో ఎన్నో అద్భుతాలు

**ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి**

వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏడాది పాలనలో ఎన్నో అద్భుతాలు సృష్టించారని, ప్రజా సంక్షేమ పథకాల అమలులో అగ్రగామిగా ఉంటూ జనరంజకమైన పాలన చేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గతనెల 30న దుత్తలూరులో ఆయన వైయస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలోనే ప్రజలందరి అభిమానాన్ని ముఖ్యమంత్రి చూరగొన్నారని, అత్యంత తక్కువ కాలంలోనే మంచి ముఖ్యమంత్రిగా ప్రజల ఆశీస్సులు అందుకుంటున్నారని ప్రశంసించారు. రైతన్నల సంక్షేమం కోసం కనీవినీ ఎరుగని విధంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక పథకాలు అమలుచేస్తున్నారని, రైతుభరోసా కేంద్రాలు అన్నదాతలకు ఒక వరమని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, వ్యవసాయ శాఖ ఏ.ఓ వెంకటసుబ్బారెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏ.డి వెంకటసుబ్బయ్య, వైకాపా మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం దుంగలు స్వాధీనం

నెల్లూరు జిల్లా ఆత్మకూరు రేంజి పరిధిలోని అటవీ ప్రాంతంలో భారీ ఎర్రచందనం దుంగల డంప్ ను ఈనెల 1 న అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు రేంజి పరిధిలోని వింజమూరు మండలం వెంకటాద్రి పాళెం వద్ద క్వారీ నీటిగుంటలో ఎర్రచందనం డంప్ వున్నట్లు సమాచారం రావడంతో నిఘా వుంచి 107 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రేంజర్ హరి తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.7 లక్షలు ఉంటుందన్నారు. డంప్‌కు సంబంధించిన స్మగ్లర్లను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## అన్నదాతల సంక్షేమమే..

# ముఖ్యమంత్రి జగన్ ధ్యేయం

**- మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి**



రాష్ట్రంలోని అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు సకల చర్యలు తీసుకుంటున్నారని పరిశ్రమలు, ఐటి శాఖల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అన్నారు.

గతనెల 30న మండలకేంద్రమైన ఓజిలిలో రైతుభరోసా కేంద్రాన్ని ఆయన ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న రైతు భరోసా కేంద్రాలు ఇక రైతుల సేవకు అంకితమవుతున్నాయన్నారు. రైతులకు అన్ని వేళలా ఇవి ఎంతో మార్గదర్శకంగా ఉంటాయని, ఈ కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులతో పాటు ఆక్వా, మత్స్య, ఉద్యాన ఉత్పత్తులకు సంబంధించి కూడా మద్దతు ధరలు కల్పించేందుకు ఆయా శాఖల అధికారులు రైతన్నలకు అందుబాటులో ఉంటారన్నారు. పాదయాత్రలో రైతుల కష్టాలను బాగా తెలుసుకున్నారని, అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైయస్ జగన్ రైతులను ఆదుకునేందుకు రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో పాటు, పంటలకు మద్దతు ధర కల్పించారని, ఇంకా రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంతో పాటు పంటల బీమా సౌకర్యం తదితర వసతులు ఏర్పాటు చేశారని చెప్పారు. రైతు భరోసా కింద రైతుల పెట్టుబడికి సాయంగా 13,500 రూపాయల నగదు అందజేస్తున్నారని, తొలి విడతగా రైతుల ఖాతాల్లో 5,500 నగదు జమచేశారని, ప్రభుత్వ పథకాలను రైతులకు నేరుగా అందజేసేందుకు ముఖ్యమంత్రి తీసుకుంటున్న శ్రద్ధ చొరవ అమోఘమని, భవిష్యత్తులో రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించనున్నాయన్నారు. రైతుభరోసా కేంద్రాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలనే కాక, నవరత్నాల పథకాల వంటి ఎన్నో పథకాలను కూడా ముఖ్యమంత్రి వైయస్ జగన్ అందజేస్తూ ప్రజలందరికీ సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసి ప్రజల పురోగతికి ఎంతగానో దోహదం చేస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో పాటు జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, అసిస్టెంట్ కలెక్టర్ భావన, జాయింట్ కలెక్టర్ వినోద్ కుమార్, ఆర్డీఓ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## పసుపు కొనుగోలు కేంద్రాన్ని కొనసాగించాలి

**రైతుల డిమాండ్**

పసుపు కొనుగోలు కేంద్రాన్ని కొనసాగించాలంటూ గతనెల 31న ఉదయగిరిలో పసుపు పండించే రైతులు ధర్నాందోళన నిర్వహించారు. ఉదయగిరి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ ఆందోళనలో పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు. జిల్లా రైతు సంఘం నాయకుడు శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వం ఇక్కడ పసుపు కొనుగోలు కేంద్రాన్ని కొనసాగించి, క్వింటా పసుపుకు 10వేల రూపాయలను రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు అజయ్‌కుమార్, వెంకటయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

### రంగులపై సుప్రీం తీర్పు...

# వైసిపి సర్కార్‌కు చెంపపెట్టు



ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగుల విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తీర్పును అధికార వైసిపి ప్రభుత్వానికి చెంపపెట్టుగా ఆయన పేర్కొన్నాడు. ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులేయడంపై హైకోర్టు చీవాట్లు పెట్టినప్పుడే మీ పిచ్చి పరాకాష్టకు చేరిందని హెచ్చరించామని, సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసేదాకా వారి పైత్యాన్ని కొనసాగించారని ఆయన ఎద్దేవా చేశాడు. నాలుగు వారాల్లోగా రంగులు తొలగించకపోతే కోర్టు ధిక్కారంగా పరిగణిస్తామని సుప్రీం కోర్టు హెచ్చరించడం జగన్ ప్రభుత్వానికి గడ్డిపెట్టడమేనన్నాడు. ఈ తీర్పు తర్వాత విలువలు పాటించేవారైతే రాజీనామా చేస్తారని, అలాంటి విలువలు, సంప్రదాయాలు పాటించే అలవాటు లేదుకాబట్టి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇకనుండైనా న్యాయ, రాజ్యాంగ సంస్థలతో చెలగాటం మానుకుని పద్ధతిగా వ్యవహరించాలని, రంగులేయడంపై వున్న శ్రద్ధ పరిపాలనపై చూపాలని ఆయన కోరాడు.

### కరోనా కష్టాల్లో...

# రెడ్‌క్రాస్ సేవలు అమోఘం

### అభినందించిన గవర్నర్



లాక్‌డౌన్ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు రెడ్‌క్రాస్ అందించిన సేవలు అమోఘమని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ కొనియాడారు. ఈ నెల 3వ తేదీన ఆయన విజయవాడలోని రాజ్‌భవన్ నుండి గవర్నర్ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మెన్ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఏ.కె.ఫరీదాలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, రెడ్‌క్రాస్ జిల్లా శాఖల ఛైర్మెన్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు జడ్పీ కార్యాలయంలోని డిస్ట్రిక్ట్ ఎమర్జెన్సీ ఆపరేటింగ్ సెంటర్ నుండి జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు లాక్‌డౌన్ సమయంలో రెడ్‌క్రాస్ ద్వారా బాధితులకు అందించిన సేవలను వివరించారు. లాక్‌డౌన్ మొదలైనప్పటి నుండి కరోనా నియంత్రణకు రెడ్‌క్రాస్ సభ్యులు సైనికుల్లా పనిచేశారని, నిస్సహాయులకు నిరంతరం ఆహారం, మంచినీళ్ళు, మజ్జిగ వంటివి అందించారని, కరోనా వైరస్ ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కల్పించారని, కోవిడ్ సేవల్లో వున్న పోలీసులు, వైద్యసిబ్బందికి ఎంతగానో సహకరించారని తెలిపారు.

రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 73వేల మంది నిరాశ్రయులకు రెడ్‌క్రాస్ ద్వారా సేవలందించామని, ఆకలితో ఎవరూ ఇబ్బంది పడకుండా చూశామని చెప్పారు. వలస కూలీలకు కూడా రెడ్‌క్రాస్ అండగా నిలిచిందని, వారిని స్వస్థలాలకు పంపడంలో రెడ్‌క్రాస్ ఎంతో శ్రద్ధ తీసుకుని పని చేసిందన్నారు. అధికార యంత్రాంగం సూచనలు, సహకారంతో ఈ కరోనా యుద్ధంలో ప్రతి రెడ్‌క్రాస్ సభ్యుడు ఒక సైనికుడిలా సేవాభావంతో పనిచేశారని ఆయన గవర్నర్‌కు వివరించారు.

### ధరలు పెంచి

# దోచుకుంటున్నారు

- అనూరాధ



విద్యుత్ బిల్లులు, మద్యం ధరలు పెంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలను నిలువునా దోచుకుంటున్నారని, వైకాపా ప్రభుత్వం అందిస్తున్నది నవరత్నాలు కాదు.. నవకష్టాలనీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ విమర్శించారు. ఈనెల 3న నెల్లూరులోని ఎన్టీఆర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సిఎం తీరుపై ధ్వజమెత్తారు. డ్వాక్రా మహిళలందరికీ వడ్డీ మాఫీ చేస్తామని చెప్పి కొందరికి మాత్రమే మాఫీ చేశారని విమర్శించారు. మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన 'దిశ' చట్టం కింద ఇప్పటి వరకు ఎన్ని కేసులు నమోదయ్యాయి.. ఎంతమందికి శిక్షలు పడ్డాయో చెప్పాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలుగు మహిళ నాయకులు మల్లి నిర్మల, ముప్పాళ్ళ విజేత, పొత్తూరు శైలజ, బివి లక్ష్మి, పనబాక భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం

# సవాళ్లతో సంవత్సరం



రెండోదఫా పరిపాలనలో నరేంద్ర మోడీ మరింత దూకుడు పెంచాడు. రెండోసారి పగ్గాలు చేపట్టిన తొలిఏడాదిలోనే ఎన్నో సంచలనాలకు తెరతీశాడు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న సమస్యలకు పరిష్కారాలు సాధించాడు. ముఖ్యంగా అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి మార్గం సుగమం కావడం చెప్పుకోదగ్గ అంశం. ముస్లింలు కూడా అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చిన చోటే రామమందిరం నిర్మాణానికి ఆమోదం తెలపడం, సుప్రీంకోర్టు ద్వారా ఈ సమస్యకు ముగింపు దొరకడం ఆహ్వానించదగ్గ పరిణామం.

కేంద్రంలోని ఎన్డీఏ-2 ప్రభుత్వం తొలిఏడాది పాలనను విజయవంతంగా పూర్తిచేసుకుంది. ఎన్డీఏ-1లో నోట్ల రద్దు, జిఎస్టీ వంటి పెనుసవాళ్లను విజయవంతంగా అధిగమించి, పఠాన్‌కోట్, పుల్వామా దాడులకు ప్రతీకారంగా సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్‌లతో ఉగ్రవాద దేశం పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టించిన నరేంద్రమోడీ ప్రభుత్వం, 2019 ఎన్నికల్లో అంచనాలకు మించిన భారీ విజయాన్ని అందుకోవడం తెలిసిందే!

దేశంలో ఆర్థిక రంగ పరిస్థితులు అటు ఇటుగా వున్నా, నిజాయితీతో కూడిన పాలన, మౌలిక రంగాల అభివృద్ధి, దేశ భద్రత విషయంలో రాజీపడని ధోరణి, ఉగ్రవాదాన్ని ఉక్కు పాదంతో అణచివేసే పనిని మాటల్లో కాకుండా చేతల్లో చూపడం వంటి నరేంద్రమోడీ పనితనం ప్రజల ఆదరణ పొందాయి. అందుకే 2014 ఎన్నికల విజయానికి మించిన ఘనవిజయాన్ని 2019 మోడీకి ఈ దేశ ప్రజలు అందించారు.

రెండోదఫా పరిపాలనలో నరేంద్ర మోడీ మరింత దూకుడు పెంచాడు. రెండోసారి పగ్గాలు చేపట్టిన తొలిఏడాదిలోనే ఎన్నో సంచలనాలకు తెరతీశాడు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న సమస్యలకు పరిష్కారాలు సాధించాడు. ముఖ్యంగా అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి మార్గం సుగమం కావడం చెప్పుకోదగ్గ అంశం. ముస్లింలు కూడా అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చిన చోటే రామమందిరం నిర్మాణానికి ఆమోదం తెలపడం, సుప్రీంకోర్టు ద్వారా ఈ సమస్యకు ముగింపు దొరకడం ఆహ్వానించదగ్గ పరిణామం. జమ్మూ-కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయడం నరేంద్ర మోడీ గత ఏడాది తీసుకున్న చారిత్రాత్మక, సాహసోపేత నిర్ణయాలలో ఒకటి. జమ్మూ-కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి తొలగిస్తే దేశం అగ్నిగుండమవుతుందని, ముస్లింలు ఆందోళనలకు దిగుతారంటూ కాంగ్రెస్, ఇతర విపక్షాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశాయి. కాని, నరేంద్ర మోడీ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. జమ్మూకాశ్మీర్‌కు ఆర్టికల్ 370ని తొలగించి, జమ్మూ-కాశ్మీర్, లడక్‌లను కేంద్రపాలిత ప్రాంతాలుగా గుర్తించారు. జమ్మూ-కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి తీసేస్తే దేశం అల్లకల్లోలమైపోతుందంటూ 70ఏళ్లుగా కాంగ్రెస్ చేస్తూ వచ్చిన ప్రచారాన్ని ఒక్క నిర్ణయంతో నిర్వీర్యం చేశారు.

పాక్ ఆక్రమిత కాశ్మీర్ విషయంలో సైతం మోడీ దూకుడు పెంచాడు. పి.ఓ.కేని తిరిగి స్వాధీనం చేసుకునే దిశగా చర్యలు చేపట్టారు. పి.ఓ.కెలో వాతావరణం బులెటిన్‌ని కూడా భారత్ నుండే విడుదల చేయసాగారు. కరోనా వైరస్ వల్ల మూడు నెలలుగా ప్రతిష్టంభన ఏర్పడిందిగాని లేకుంటే పి.ఓ.కె విషయంలో ఇప్పటికే సాహసోపేత సంచలన సంఘటన జరిగిపోయి వుండేది.

నరేంద్ర మోడీ ఈ పదవీకాలంలో తీసుకున్న నిర్ణయాలలో అత్యంత సంచలనమైంది సిఏఏ, ఎన్‌సిఆర్, ఎన్‌పిఆర్ బిల్లులు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న మైనార్టీలైన హిందువులు, బౌద్ధులు, సిక్కులు, క్రైస్తవుల సంరక్షణార్థం, వారికి భారతీయ పౌరసత్వం కల్పించేలా రూపొందించిన సిఏఏ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందడం తెలిసిందే! అలాగే అక్రమ చొరబాటుదారులను ఏరివేసే ఎన్‌సిఆర్ చట్టాన్ని కూడా పార్లమెంటు ఆమోదించింది. ఈ చట్టాలు మత వివక్షతతో కూడుకున్నాయంటూ ముస్లింలు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నా... కేంద్రం మాత్రం కరోనా మూలంగా ఈ చట్టాలను అమలు చేయడం వాయిదా వేసిందేగాని రద్దు చేయలేదు. ఈ చట్టాలను రద్దుచేసే ఆలోచనలో కూడా కేంద్రం లేదు. ఇక ముస్లిం మహిళలను వివక్షకు గురిచేసే ట్రిపుల్ తలాక్ చట్టాన్ని రద్దు చేశారు.

అలాగే రెండోదఫా పాలనలో తొలిఏడాదిలోనే సరికొత్తగా అన్ని రంగాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఎన్నో కొత్త పథకాలను పట్టాలెక్కించారు. అన్ని రంగాలలోనూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ సరికొత్త భారతావని ఆవిష్కరణకు కృషి చేశారు.

ముఖ్యంగా కరోనా వైరస్‌ను ఎదుర్కొనే విషయంలో భారత్‌ను అగ్రదేశాలకు కూడా ఆదర్శంగా మలిచారు. కరోనా వైరస్‌పై యుద్ధంలో అగ్రరాజ్యాలు కూడా భారత్ వెన్నంటి నడుస్తున్నాయి. చైనాతో సరిహద్దు వివాదాలలో సైతం నరేంద్ర మోడీ నాయకత్వం ఎంతో సమర్థవంతంగా పనిచేసింది. చైనాతో వివాదం తలెత్తిన నేపథ్యంలో అమెరికానే కాక, ఆస్ట్రేలియా, జపాన్, ఇజ్రాయిల్, ఇంకా మరిన్ని ఐరోపా దేశాలు భారత్‌కు అండగా నిలిచాయంటే అంతర్జాతీయంగా భారత్ ప్రాభవం ఎంతగా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు, భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం చైనా మినహా మిగిలిన సభ్య దేశాలు మద్దతు పలకడం, జి-7 దేశాల గ్రూప్‌లో భారత్‌ను చేర్చాలని అమెరికా అధ్యక్షుడు పట్టుపట్టడం వంటి అంశాలన్నీ కూడా మోడీ నాయకత్వ సమర్థతకు దర్పణంగా నిలుస్తాయి. ముఖ్యంగా గత ఆరేళ్లుగా మోడీ నడిపిన దౌత్య రాజకీయాలు, చేసిన విదేశీ ప్రయాణాలు ఈరోజు ఎన్నో అగ్రదేశాలు భారత్‌పట్ల తమ వైఖరిని మార్చుకునేలా చేశాయి. సరికొత్త ప్రపంచానికి భారత్ నాయకత్వాన్ని కోరుకునేలా మోడీ పరిపాలనా ప్రయాణం ముందుకు సాగుతోంది.

## బేబీ కేర్ వార్డు

కరోనా పాజిటివ్‌గా నమోదైన తల్లిదండ్రుల పిల్లలను వారి వద్ద ఉంచకుండా ఆ పిల్లల సంరక్షణ కోసం నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రిలో బేబీ కేర్ వార్డును ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. గతనెల 31న కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశమై మాట్లాడుతూ అందుకు సంబంధించి ఐసిడిఎస్ అధికారుల సహాయం తీసుకోవాలన్నారు. జిల్లాలో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్న విఆర్‌డిఎల్ ల్యాబ్‌లో జరుగుతున్న కోవిడ్ వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కోయంబేడు మార్కెట్ కరోనా పాజిటివ్ కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా వైద్యశాఖ జేడీ డాక్టర్ రాజేంద్రప్రసాద్, డిఎం అండ్ హెచ్ఓ రాజ్యలక్ష్మి, జిజిహెచ్ సూపరింటెండెంట్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ఏకాంతంగా.. పెంచలస్వామి కల్యాణం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో గతనెల 30న పెనుశిల నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి-చెంచులక్ష్మీదేవి అమ్మవార్ల కల్యాణం ఏకాంతంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల అనంతరం మూడవ శనివారం కావడం, 10 మంది భక్తులు ఆన్‌లైన్ ద్వారా కల్యాణోత్సవానికి బుక్ చేసుకోవడంతో శ్రీవారి కల్యాణం నిర్వహించారు.

## గంగపట్నం చాముండేశ్వరీదేవికి విశేషపూజలు

నెల్లూరుజిల్లా, ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో కొలువైవున్న గ్రామశక్తి శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత నెల 31న అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఏకాంతంగా పూజలు చేశారు.




## బ్రతికితే అలా బతకాలి!

సినీ పరిశ్రమలో, క్రీడా రంగంలో ఎంతోమంది వందలు, వేల కోట్లు సంపాదించిన వాళ్ళున్నారు. ఈ దేశ ప్రజల డబ్బే అది. అదే ప్రజలకు ఆపద వచ్చినప్పుడు వారిని ఆదుకోవడానికి కొద్దిమందే ముందుకు వస్తున్నారు. ఈ కరోనా కష్టాలలో ప్రజల కోసం తాము సంపాదించిన సొమ్మును ఉదారంగా ఖర్చు పెట్టిన రియల్ హీరోలు అక్షయ్ కుమార్, సోనూసూద్‌లు. ప్రతిఒక్కరూ బ్రతికితే వీళ్ళ మాదిరిగా బ్రతకాలి. దేశం కోసం, ప్రజల కోసం బ్రతకాలి. దేశం గర్వించేలా తమ సేవలు అందించిన అక్షయ్‌కుమార్, సోనూసూద్‌లకు హేట్సాఫ్!

*జి.ఎస్.రెడ్డి, నెల్లూరు.*

## చిత్తశుద్ధి చూపిన సీఎం

ఏడుకొండల వెంకన్న స్వామి పట్ల తన భక్తిని, విశ్వాసాన్ని చూపించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి అభినందనలు. టిటిడి ఆస్తులు వేలం వేయాలంటూ తెలుగుదేశం ప్రభుత్వంలో రూపొందించిన జి.ఓను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినది. భవిష్యత్‌లో కూడా తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. తిరుమలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలి. శ్రీవారి నిధులను కేవలం హిందూధార్మిక కార్యక్రమాలకు మాత్రమే ఉపయోగించాలి. అలాగే స్వామివారి మహాప్రసాదాన్ని ప్రజలకు చేరువ చేసినందుకు ధన్యవాదాలు.

*సి.రాజీవి, నెల్లూరు.*

## ప్రజల్లో చైతన్యం రావాలి

కరోనా వైరస్ పూర్తిగా అంతరించిపోయే పరిస్థితి లేదు. ఈ ప్రపంచంలో ఇప్పటివరకు పుట్టిన ఏ వైరస్ కూడా పూర్తిగా తొలిగిపోలేదు. కాకపోతే దీనికి వ్యాక్సిన్‌లు, మెడిసిన్‌లు వచ్చేదాకా ప్రజలు అప్రమత్తంగా వుంటూ, కరోనా బారిన పడకుండా జాగ్రత్తపడాలి. మాస్కులు ధరించాలి, సామాజిక దూరం పాటించాలి. లాక్‌డౌన్‌ను ఎత్తేసినా, నిబంధనలను మాత్రం తప్పనిసరిగా పాటిస్తూ.. ఎవరికి వారు స్వీయ నియంత్రణలో ఉంటూ కరోనాను కట్టడిచేయాలి. కరోనా వైరస్‌కు భయపడి ఎల్లకాలం లాక్‌డౌన్‌ను కొనసాగించలేరు. అలాచేస్తే ఆర్థిక వ్యవస్థ పూర్తిగా బలహీనపడి తినడానికి తిండి కూడా దొరకదు. లాక్‌డౌన్ వల్ల వైరస్ వ్యాప్తిని కొంతవరకు అడ్డుకోగలిగాం. వైరస్‌ను ఎలా ఎదుర్కోవాలనేదానిపై చైతన్యవంతం కాగలిగాం. ఈ విషయంలో ప్రజల్లో మరింత చైతన్యం రావాలి.

*డాక్టర్ అంకిత్, హైదరాబాద్.*

# త్రిశంకు స్వర్గంలో... భూగర్భ డ్రైనేజీ

- అసంపూర్తిగా పనులు
- 1100 కోట్లు ఖర్చు చేసినా ఉపయోగం లేని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ
- ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకుంటేనే సద్వినియోగమయ్యే పరిస్థితి



గత తెలుగుదేశం ప్రభుత్వంలో 1100 కోట్ల రూపాయల హడ్కో నిధులతో నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌ల పనులను చేపట్టడం తెలిసిందే! అప్పుగా ఇచ్చే నిధులతో ఈ పనులు పూర్తి చేసినా, ప్రజలపై పన్నుల భారం పెంచి వసూలు చేస్తారనే ప్రచారం వచ్చిన నేపథ్యంలో అప్పట్లో ఈ పనులు వద్దంటూ ఆందోళనలు చేయడం కూడా తెలిసిన విషయమే! చివరకు అప్పట్లో కేంద్రమంత్రిగా, ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చూపిన చొరవ మూలంగా హడ్కో నిధులకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వడంతో ప్రజలపై పన్నులు పెంచే అవసరం లేకుండా నిధులు మంజూరు కావడం, పనులు మొదలు కావడం జరిగింది.

సంగం బ్యారేజీ నుండి నెల్లూరు నగరం వరకు మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి. అసలు సమస్యల్లా నెల్లూరు నగరంలో చేసిన భూగర్భ డ్రైనేజీ పనులతోనే వచ్చింది. భూగర్భ డ్రైనేజీ పనుల కోసమని గతంలో వందల కోట్ల వ్యయంతో వేసిన సిమెంట్, తారురోడ్లను తవ్వేశారు. అప్పట్లో ఈ పనులు అడ్డదిడ్డంగా జరిగాయి. అనుభవం లేని వాళ్లు చాలాచోట్ల సబ్‌వర్క్‌లు చేయడం వల్ల, తవ్విన రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. భూగర్భడ్రైనేజీ కోసం తవ్వినరోడ్లను తిరిగి వేయడానికి దాదాపు 600 కోట్లు ఖర్చు చేశారు. అప్పట్లో ఎన్నికల హడావిడితో సిమెంట్ రోడ్లను నాణ్యత లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వేశారు. అవసరం లేని చోట్ల కూడా కోట్లాది రూపాయల వ్యయంతో సిమెంట్‌రోడ్లు వేసేశారు. ముఖ్యంగా మినీబైపాస్‌తో పాటు మరికొన్నిచోట్ల తవ్వినచోట సరిగా క్యూరింగ్ చేయకుండానే తారు రోడ్లు వేశారు. ఇప్పుడు మినీబైపాస్ రోడ్డులో ఒకవైపు కుంగిపోయి వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది.

గత ప్రభుత్వంలో అవకతవకలుగానే భూగర్భ డ్రైనేజీ పనులు చేశారు. అయితే ఇంతవరకు ఇది ఉపయోగంలోకి రాలేదు. వైసిపి అధికారంలోకి వచ్చి ఏడాదయ్యింది. గత ప్రభుత్వంలో 1100 కోట్లకుపైగా ఖర్చు చేసిన పనులను ఇప్పుడు వాడకంలోకి తీసుకురావాల్సివుంది. అసలు ఇప్పటివరకు చేసిన భూగర్భడ్రైనేజీ పనుల వల్ల ఉపయోగముందో లేదో కూడా చూడాలి! రోడ్లను తవ్వి పైపులు వేశారేగాని, ఇళ్లకు ఇంతవరకు కనెక్షన్ ఇవ్వలేదు. పూర్తిస్థాయిలో నగర శివార్లలో డ్రైనేజీ ట్యాంకులను ఏర్పాటు చేయలేదు. భూగర్భ డ్రైనేజీకి సంబంధించి ఇప్పటివరకు జరిగిన పని ఒకెత్తయితే, ఇకముందు జరగాల్సింది మరో ఎత్తు. కాబట్టి ఇప్పటిదాకా అవకతవకలుగా జరిగిన పనులయినా ప్రజలకు ఉపయోగంలోకి రావాలంటే ఈ పనులను పూర్తి చేయాలి. ఇప్పటివరకు ఖర్చుచేసిన నిధులు వృధాకాకుండా చూడాలి! జిల్లా మంత్రి, సంబంధిత ఎమ్మెల్యేలు ఈ దిశగా దృష్టి సారించాల్సివుంది.

- ఉపాధి...

# ఉంటుందా? ఊడుతుందా?



సుదీర్ఘ లాక్‌డౌన్ తర్వాత షాపింగ్ మాల్స్, సినిమా హాల్స్, హోటల్స్, రెస్టారెంట్లు, స్వీట్స్ అండ్ బేకరీస్, వస్త్ర దుకాణాలు, వివిధ రకాల పరిశ్రమలు ఇప్పుడిప్పుడే తెరచుకుంటున్నాయి. రెండు నెలలకుపైగా సాగిన లాక్‌డౌన్‌తో అన్ని వ్యాపార రంగాల వాళ్లు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా అద్దెలు, కరెంట్ ఛార్జీలు కట్టడానికి కూడా వ్యాపారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి.

లాక్‌డౌన్ ఎత్తేసి తిరిగి వ్యాపారాలు మొదలుపెట్టినా కోలుకోవడానికి ఏడాది పడుతుందని చాలా మంది వ్యాపారులు ముందుగానే భావించారు. దాంతోనే లాక్‌డౌన్ ఎంతకాలముంటుందో తెలియక, వ్యాపారాలు లేకుండా జీతాలు ఇవ్వలేక చాలా వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ సిబ్బందిలో సగానికిపైగానే తొలగించాయి. ఇతర రాష్ట్రాల నుండి వచ్చి, ఇక్కడ హోటల్స్‌లో, బేకరీలలో, బ్యూటీపార్లర్‌లలో, ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న వాళ్లయితే లాక్‌డౌన్ అనగానే వాళ్ళ ఊర్లకు వెళ్లిపోయారు. వాళ్లంతా తిరిగి వస్తేనేగాని కొన్ని రకాల వ్యాపార సంస్థలు తిరిగి పుంజుకునే పరిస్థితి లేదు. ఒకరిద్దరు ఉద్యోగులతో నడిచే సంస్థలకు వచ్చిన ఇబ్బందేమీ లేదు గాని, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులతో పనిచేస్తున్న వ్యాపార సంస్థలు మళ్లీ గాడిన పడడానికి కొంత సమయం పట్టొచ్చు. ఈ క్రమంలో చాలామంది ఉపాధి కోల్పోయే ప్రమాదం కూడా వుంది. ప్రభుత్వం కూడా లాక్‌డౌన్ నిబంధనలలో సాధారణంగా వుండే వారిలో మూడోవంతు సిబ్బందితోనే కార్యకలాపాలు కొనసాగించమని చెప్పడం కూడా ఉద్యోగాలకు ఎసరు తెచ్చిపెట్టేటట్లుంది.

ఏదేమైనా వ్యాపార లావాదేవీలు మామూలు స్థితికి వచ్చినా, చాలామందికి ఉపాధి పోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఒక్కొక్కటిగా... ఒకప్పటిలాగా!

## సాధారణ స్థితికి నెల్లూరు నగరం



ఈ నెలాఖరుదాకా లాక్‌డౌన్ అమలులో వుంది. అయితే పేరుకే లాక్‌డౌన్... పరిస్థితులన్నీ సాధారణ స్థితికి వచ్చేశాయి. కరోనా అనే భయం నుండి కూడా జనాలు బయటపడుతున్నారు. మాస్క్‌లు తప్పనిసరి అని చెప్పినా, చాలామంది అవి వాడడం లేదు. శానిటైజర్ల వాడకం కూడా క్రమంగా తగ్గుతోంది.

మార్చి 22 నుండి లాక్‌డౌన్ అమలులోకి వచ్చాక నెల్లూరు నగరం బోసిపోవడం తెలిసిందే! ఎమర్జెన్సీ వాహనాలు, అధికారుల వాహనాలు తప్పితే నెల్లూరురోడ్లపై 80రోజులుగా ఏ వాహనాలు కనిపించలేదు. నగరంలో తిరిగే దాదాపు 20వేలకుపైగా ఆటోలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కాగా, లారీలు, ఇతర వాహనాలు షెడ్లకు పరిమితమయ్యాయి.

లాక్‌డౌన్ సడలింపులతో ఇప్పుడు యధాతథ పరిస్థితి నెలకొంది. నగర రోడ్లపై కార్లు రయ్‌రయ్‌మంటూ దూసుకుపోతున్నాయి. పూర్తిస్థాయిలో బస్సులను, రైళ్లను వదలలేదు కాబట్టి ఆటోలు, కార్ల తిరుగుడు కొంచెం తక్కువగానే వుంది. అన్ని రకాల వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాలు తెరవడంతో నగరంలో జనసంచారం లాక్‌డౌన్‌కు ముందున్నట్లే వుంది. ఇంకా విద్యాసంస్థలను తెరవకపోవడంతో దానికి సంబంధించిన బస్సులు ఇంకా రోడ్లెక్కలేదు.

### 8 నుండి తెరచుకోనున్న ఆలయాలు



కంటోన్మెంట్ జోన్‌లలో తప్పితే, మిగతా అన్నిచోట్ల దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఈ నెల 8 నుండి తెరుచుకోవడానికి కేంద్రం అనుమతించింది. దీంతో దాదాపు 80రోజులుగా భక్తులకు దర్శనాలు కరువైన దేవస్థానాలు తిరిగి ఆధ్యాత్మిక కళాకాంతులు విరజిమ్మబోతున్నాయి. కాని గతంలో లాగా భక్తులను గుంపులు గుంపులుగా అనుమతించే పరిస్థితి దేవాలయాలలో ఇతర ప్రార్థనా మందిరాలలో లేదు. భౌతిక దూరం పాటించేలా గుళ్లలో కూడా క్యూలైన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పరిమిత సంఖ్యలోనే భక్తులను గుళ్లలోకి అనుమతించనున్నట్లు తెలుస్తోంది.

మొత్తానికి 80రోజుల నిశ్శబ్దాన్ని చీల్చుకుని నెల్లూరు నగరంలో సందడి మొదలైంది. వ్యాపారాలు కూడా పుంజుకుంటున్నాయి. త్వరలోనే థియేటర్స్ కూడా ప్రారంభం కావొచ్చు. కాబట్టి నెల్లూరు నగరం తిరిగి ట్రాక్‌లో పడడానికి పెద్ద సమయం పట్టకపోవచ్చు.

# రైతులకు 7% వడ్డీతో అదనపు రుణాలు



వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి

వ్యవసాయ సహకార రుణాల ద్వారా రైతులకు ఏడుశాతం వడ్డీతో అదనపు రుణాలు మంజూరు చేయనున్నట్లు డీసీసీబీ మాజీ ఛైర్మన్, చవటపాళెం సహకార సంఘ ఛైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. ఈనెల 1న వెంకటాచలంలో విలేకర్లతో మాట్లాడుతూ చవటపాళెం సహకార సంఘాల ద్వారా రైతులకు ఎకరాకు మాగాణికి రూ.2.5 లక్షలు, మెట్టకు రూ.1.5 లక్షలు మొత్తం రూ.5 కోట్లు స్వల్పకాలిక రుణాలిచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం కరోనా నేపథ్యంలో స్వల్పకాలిక రుణాలు తీసుకున్న రైతులకు వారు తీసుకున్న మొత్తంలో ప్రస్తుతం మరలా 20శాతం(రూ.లక్షకు రూ.20 వేలు) ఏడు శాతం వడ్డీకి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ రుణాలు ఏడాది లోపు చెల్లించాల్సి వుంటుందన్నారు. సొసైటీ డైరెక్టర్లు రమణయ్య, జయకుమార్‌రెడ్డి, సీఈవో రవి తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల తర్వాత

# నెల్లూరు స్టేషన్‌లో ఆగిన రైలు

• ప్రయాణీకులతో కళ కళ



నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకులను చూసి రెండు నెలలు దాటి పోయింది. కరోనా వైరస్, లాక్‌డౌన్ నేపథ్యంలో మార్చి 22 నుండి రైళ్ల రాకపోకలు నిలిచిపోవడం తెలిసిందే! అప్పటినుండి నెల్లూరు రైల్వే స్టేషన్ బోసిపోయింది. మధ్యలో రెండు శ్రామిక రైళ్లు మాత్రం ఇక్కడ నుండి వెళ్లాయి. ప్రతి రోజూ గూడ్స్‌లు తిరుగుతున్నాయి. కాని ప్యాసింజర్ రైళ్లు లేక రైల్వేస్టేషన్ కళావిహీనంగా ఉండేది.

ఎట్టకేలకు కొన్ని రూట్లలో పరిమిత సంఖ్యలో రైళ్లకు అనుమతినివ్వడంతో సోమవారం 1వ తేదీ నెల్లూరు రైల్వేస్టేషన్ కొద్ది సంఖ్యలో వచ్చిన ప్రయాణీకులతో కొంత పాత కళను సంతరించుకుంది. దేశవ్యాప్తంగా వేసిన కొన్ని రైళ్లలో బెంగుళూరు నుండి ధన్‌బాద్ వెళ్లే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ మాత్రమే నెల్లూరు మీదుగా నడిచింది. 1వ తేదీ సాయంత్రం 6.10 గంటలకు ఈ రైలు నెల్లూరు రైల్వేస్టేషన్‌కు చేరుకోగా బెంగుళూరు నుండి వచ్చిన 28మంది ప్రయాణీకులు నెల్లూరులో దిగారు. 55 మంది ప్రయాణీకులు ఇక్కడ నుండి ఈ రైలులో ఎక్కారు. ప్రయాణీకులు భౌతిక దూరం పాటించేలా ప్లాట్‌ఫారాలపై మార్కింగ్ ఇచ్చారు. మాస్క్‌లు, శానిటైజర్లు తప్పనిసరి చేశారు. ఈ రైలు వచ్చిన నేపథ్యంలో కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, జేసీ వినోద్‌కుమార్, ఆర్డీఓ హుస్సేన్‌బాషా, రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ కుమార్‌లు ప్రయాణీకులకు థర్మల్ స్క్రీనింగ్, స్వాబ్ పరీక్షలను పర్యవేక్షించారు.

# జిమ్ ట్రైనర్లను ఆదుకోవాలి

నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ జిమ్‌లలో పనిచేస్తున్న ట్రైనర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదిత్యసాయి ప్రభుత్వాన్ని కోరారు. నెల్లూరులోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఈనెల 1న విలేకర్లతో మాట్లాడుతూ యువతకు బాడీ బిల్డింగ్ వంటి ఫిట్‌నెస్ కార్యక్రమాలకు తమ వంతు కృషి చేస్తున్న ట్రైనర్లు లాక్‌డౌన్ కారణంగా మూడునెలలుగా ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని, వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. ఆఫ్రోజ్, రబ్బానీ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

జయభారత్ హాస్పిటల్‌కి

# పీపీఈ కిట్ల వితరణ

నెల్లూరులోని జయభారత్ హాస్పిటల్‌కి బీజేపీ నెల్లూరు లోక్‌సభ స్థానం అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్ కుమార్ వెయ్యి పీపీఈ కిట్లను ఈనెల 1న అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ జాతీయ కార్యదర్శి సత్య కుమార్ సహకారంతో వీటిని అందజేశామన్నారు. ప్రధాని మోదీ కృషితో దేశంలో పీపీఈ కిట్లు పెద్ద సంఖ్యలో తయారవుతున్నాయన్నారు. కరోనా బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించాలని, ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అనంతరం నగదు సాయంతో పాటు పౌష్టికాహారం, శానిటైజర్లు, మాస్క్‌లు అందించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, నాయకులు సురేంద్ర రెడ్డి, మొగరాల సురేష్, ముక్కు రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, కాకరపర్తి జగన్మోహన్‌రావు, మండ్ల ఈశ్వరయ్య, బాల సుబ్బారావు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గత ఏడాది ఫీజులనే

# వసూలు చేయాలి

- డిఇఓ జనార్ధనాచార్యులు

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, ఏపి ఫీజు రెగ్యులేటరీ మానిటరింగ్ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో గత ఏడాది ఎంత ఫీజు ఉందో ఈ విద్యాసంవత్సరంలోనూ అంతే ఫీజు వసూలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధనాచార్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్రైమాసిక ఫీజు కూడా అదేవిధంగా వసూలు చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులు ట్యూషన్ ఫీజును దశల వారీగా చెల్లించగలమని చెప్తే, పాఠశాలలను పునఃప్రారంభించిన అనంతరం ఆగస్టు 3వ తేదీ తర్వాతే వసూలుచేయాలని ఆయన పేర్కొన్నారు.

# తెలుగుగంగ డెప్యూటి కలెక్టర్ బదిలీ

తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ డెప్యూటి కలెక్టర్(ఎల్ఏ)గా పనిచేస్తున్న వెంకటేశును చిత్తూరుజిల్లా కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం గతనెల 30న ఉత్తర్వులు జారీ చేసింది.

# కమలకుమారి ఉద్యోగ విరమణ

నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్-2 కమలకుమారి గత నెల 31న ఉద్యోగ విరమణ పొందారు. జిల్లాలో దీర్ఘకాలం ఆమె వివిధ హోదాల్లో పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం జేసీ-2గా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగ విరమణ పొందిన ఆమెకు ఉద్యోగ సంఘాల నాయకులు, అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. తెలుగుగంగ ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న నాగలక్ష్మిని ఇన్‌చార్జి జేసీ-2గా నియమించారు.

నెల్లూరు కబుర్లు

# బదిలీకి సిద్ధమయ్యాడా?



ఈ లాక్‌డౌన్ సమయంలో వచ్చిన పలు రాజకీయ వివాదాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం.వి. శేషగిరిబాబు ఇక్కడ నుండి బదిలీ కావడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. లాక్‌డౌన్ సమయంలో జిల్లాలో పలు వివాదాలొచ్చాయి. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేదలకు నిత్యావసరాలు పంచే కార్యక్రమంలో నిబంధనలు అతిక్రమించారంటూ ఆయనపై కేసు పెట్టారు. ఆరోజు ఎమ్మెల్యేతో పాటు కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులకు కూడా కలెక్టర్ నోటీసులు జారీ చేయడం జరిగింది. దీనిపై ఎమ్మెల్యే ప్రసన్న తీవ్రంగా ఫైర్ అయ్యాడు. కలెక్టర్, ఎస్పీల మీదే ప్రత్యక్షంగా విమర్శలకు దిగాడు. అలాగే సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా కలెక్టర్, ఎస్పీలపై తీవ్రంగా ఆరోపణలు చేశాడు. జిల్లాలోని ఇతర ఎమ్మెల్యేలు కూడా కలెక్టర్ విషయంలో అంత సంతృప్తిగా లేరు. కాబట్టే ఆయన బదిలీ విషయంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలంతా ఒకే తాటిపై వున్నారు. వీళ్ల ధోరణి పసిగట్టే కలెక్టర్ బదిలీకి రెడీ అయినట్లు సమాచారం.

# బాపిరెడ్డి కొనసాగుతాడా?



నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా ప్రస్తుతం బాపిరెడ్డి కొనసాగుతుండడం తెలిసిందే! నుడా వైస్ ఛైర్మెన్‌గా వున్న ఆయనను కార్పొరేషన్‌కు మార్చారు. మధ్యలో కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి స్వప్నిక్ దినకర్‌ను వేసినా, రాజకీయ ఒత్తిడితో ఆయన బదిలీని రద్దు చేయడం జరిగింది. అయితే కమిషనర్ బాపిరెడ్డి ఈ పోస్టులో కొనసాగడానికి విముఖంగా వున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన అనారోగ్య సమస్య కూడా కారణంగా ఉంది.

# వైద్యసిబ్బందికి రోటరీ సాయం

- మాస్క్‌లు, శానిటైజర్ల పంపిణీ



నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రి డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందికి అవసరమైన 2500 మాస్క్‌లు, 250 శానిటైజర్లను నెల్లూరు రోటరీ క్లబ్ వారు గతనెల 31న పంపిణీ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. వాటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీహరికి అందజేశారు. రోటరీక్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, క్లబ్ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి విశ్వం తదితరులు పాల్గొన్నారు.



# తొలకరి.. పలకరింపు

• జూన్ తొలిరోజే వానజల్లులు
• ఆనందించిన ప్రజలు

ఏరువాక పున్నమి మరో నాలుగురోజులు ఉందనగానే ఈనెల 1న వానజల్లు కురవడంతో ప్రజలు ఆనందించారు. జూన్ మాసం తొలిరోజే వరుణుడు కరుణించడంతో తొలకరి పలకరింపులతో జిల్లా పులకించిపోయింది. అప్పటిదాకా మండే ఎండలతో నిప్పుల కుంపటిలా ఉన్న జిల్లా వానజల్లులతో తడిసి ముద్దయింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వానజల్లుల్లో ప్రజలు ఎంతోమంది తిరుగుతూ వానలో తడిసిపోయి ఆనందించారు. గత వారం రోజులుగా ఎండలు ఒక్కసారిగా 36 నుంచి 43 డిగ్రీలదాకా పెరిగి ఉక్కపోతతో, అధిక వేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు వానజల్లులు సంతోషం కలిగించాయి. పెంచలకోనలో కుండపోత వాన కురవడంతో జలపాతం ప్రవాహం చూసి స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. నిమ్మతోటలకు ఈ వర్షాలు బాగా ఉపకరిస్తాయని నిమ్మ రైతులు ఆనందిస్తున్నారు. సకాలంలో జిల్లాలో నైరుతి రుతుపవనాలు వచ్చి జిల్లాకు సాగునీరు పుష్కలంగా లభిస్తాయని రైతులు భావిస్తున్నారు.

# నుడా వీసీగా నవ్య

రాష్ట్రంలోని వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులకు డెప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించి బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వం గతనెల 29న ఉత్తర్వులు జారీచేసింది. నుడా వైస్ ఛైర్మెన్‌గా డాక్టర్ నవ్యను నియమించారు. అదేవిధంగా నెల్లూరు సివిల్ సప్లయిస్ విజిలెన్స్ డెప్యూటి కలెక్టర్‌గా పనిచేస్తున్న వెంకట సుధాకర్‌ను కావలి ఆర్డీఓగా బదిలీ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా చంద్రమోహన్‌ను బదిలీ చేశారు. బిసి కార్పొరేషన్ ఇ.డిగా రాజగోపాల్ నియమితులయ్యారు.

జలవనరుల శాఖ

# ఎస్.ఇగా వరలక్ష్మి

జలవనరుల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా డి.వరలక్ష్మి ఈనెల 1న నెల్లూరులోని జిల్లా వనరులశాఖ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. నీరు-ప్రగతి విభాగం ఎస్ఇగా ప్రస్తుతం ఈ శాఖలోని ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న వరలక్ష్మి జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్‌గా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది.

# బాధ్యతలు స్వీకరించిన శీనానాయక్

డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శీనానాయక్ నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా గతనెల 29న బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్ కమిషనర్ బాపిరెడ్డి అనారోగ్యంతో సెలవుపై వెళ్లడంతో శీనానాయక్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నారు.

# రాజన్న రాజ్యాన్ని మరిపించారు

**- సీఎం జగన్‌ను మెచ్చుకున్న వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం**



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 90 శాతం నెలవేర్చి రాజన్న రాజ్యం స్థాపనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు.

గతనెల 31న ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవాలన్న ఆలోచనతో 3.50కోట్ల మంది ప్రజలకు వ్యక్తిగతంగా లబ్ది చేకూర్చేలా దాదాపు రూ.45,000 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలను లబ్దిదారుల ఇళ్ళ వద్దకే వెళ్ళి అందించే వలంటీర్ల వ్యవస్థను తీసుకురావడం, పాలనను సులభతరం చేసేలా సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి చరిత్ర సృష్టించారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి సారించినట్లు పేర్కొన్నారు. పెంచలకోన-ఏర్పేడు జాతీయ రహదారి వెంకటగిరి మీదుగా ఉన్న నేపథ్యంలో వెంకటగిరిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు, 100 పడకల ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి వెనక బడిన మెట్ట ప్రాంతం అయినప్పటికీ నియోజకవర్గ ప్రజల సహకారం, చైత న్యంతో వెంకటగిరి నియోజకవర్గంలో కరోనా వ్యాప్తిని అరికట్టగలిగామన్నారు.

## సీఎం సహాయనిధికి రూ. లక్ష వితరణ

నెల్లూరుజిల్లా వెంకటగిరి పట్టణానికి చెందిన గ్యాస్ ఏజెన్సీ డీలర్ శివకోటా రెడ్డి లక్ష రూపాయల చెక్‌ను ముఖ్యమంత్రి సహాయనిధికి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి ఆయన నివాసంలో ఈనెల 1న అందజేశారు. కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా ఈ మొత్తాన్ని ఆయన అందజేశారు.

**900 మంది వలస కూలీలకు..**

# అన్నం పెట్టిన రెడ్‌క్రాస్




నెల్లూరు మీదుగా వివిధ రాష్ట్రాల్లోని తమ స్వస్థలాలకు వెళ్తున్న సుమారు 9వందల మంది వలస కూలీలకు నెల్లూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గతనెల 30న భోజనవసతి ఏర్పాటుచేశారు. అంతేకాక వారు సొంతప్రాంతాలకు వెళ్ళేందుకు రవాణా సౌకర్యం కూడా కల్పించి తమ సేవాభావం చాటుకున్నారు. నెల్లూరు ఎన్టీఆర్‌నగర్ వద్ద జాతీయరహదారిపై వలస కూలీలకు తాత్కాలికగా ఏర్పాటుచేసిన శిబిరంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి పి.జె సుధ, నెల్లూరు ఆర్డీఓ, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డిల పర్యవేక్షణలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు ఒడిస్సాకు రెండు, శ్రీకాకుళంకు ఒక బస్సు ఏర్పాటుచేశారు. 200 మంది వలస కూలీలకు వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఒక్కొక్కరికి 100 రూపాయల వంతున 20వేల రూపాయలు కూడా అందించారు. రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ సుధీర్‌నాయుడు, కమిటీ సభ్యులు ఎం.అంకయ్యచౌదరి, డి.రాజేంద్ర ప్రసాద్, రంగయ్యనాయుడు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహారమా? విషాహారమా??

- ఎలుకలు కొరికిన బిస్కెట్స్... మైనంపూత పూసిన యాపిల్స్
- కుళ్ళి కంపుకొడుతున్న ఊరగాయలు..రసాయనాలు కలిపిన పండ్లు
- అధికారుల దాడుల్లో బట్టబయలైన ఓ పండ్ల దుకాణం బండారం

***ఎలుకలు కొరికి తిన్న బిస్కెట్లు, మైనంపూత పూసిన యాపిల్స్, కుళ్ళిపోయిన కూరగాయలు..ఇంకా రకరకాలైన రసాయనాలు కలిపిన పండ్లు..అన్నిటినీ ఎంచక్కా అమాయకజనానికి అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్న ఓ పండ్ల దుకాణం బండారం ఈనెల 1న అధికారులు చేసిన దాడుల్లో బట్టబయలైంది.***



పేరుకు అది ఏ-1 పండ్ల దుకాణం. ఏ-1 వ్యాపారమంటే నాణ్యతకు కాదు.. మురుగుడు గబ్బుకు పెట్టింది పేరుగా ఉన్నట్లుంది. నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డు పక్కనే ఉన్న ఈ పండ్ల దుకాణంలో అంతా మోసపు వ్యాపారమే జరుగుతోందని అధికారులు గుర్తించారు. కుళ్ళి గబ్బు కొడుతున్న వాటిని కూడా ఇక్కడ భలే బాగుంటాయని చెప్తూ అమాయక జనానికి అమ్మేస్తున్నారని గ్రహించారు.. పండ్లు చెడిపోకుండా ఉండాలని చిత్తం వచ్చినరీతిలో రసాయనాలు పూసి ఆ పండ్లను అమ్మేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారని తెలుసుకుని విస్తుపోయారు. అంతేకాదు, పాసిపోయి కంపుకొడుతున్న ఊరగాయలు కూడా ఇక్కడ అమ్మకానికి సిద్ధంగా ఉండడం విశేషం. నెల్లూరు నగర కార్పొరేషన్ ఆరోగ్యవిభాగం అధికారులు ఈ సమాచారం తెలుసుకుని ఆ పండ్ల దుకాణంపై దాడి చేయడంతో ఈ అక్రమ వ్యవహారమంతా వెలుగులోకి వచ్చింది. వెంటనే ఆ ముగ్గిపోయిన సరుకునంతా ఆరోగ్యాధికారి వెంకటరమణ స్వాధీనం చేసుకుని డంపింగ్ యార్డుకు తరలించారు. జనం ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్న ఆ ఏ-1 వ్యాపారికి నోటీసులు జారీ చేశారు.

నెల్లూరులో ఇటీవలే కుళ్ళిపోయి కంపుకొడుతున్న టన్నుల కొద్దీ ఉన్న నిల్వ మాంసాన్ని ప్రజలకు అమ్మేసి కాసులు పండించుకుంటున్న కల్తీ వ్యాపారుల బాగోతం బయటికొచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ఇప్పుడు పండ్ల వ్యాపారులు కూడా ఇలాంటి మోసాలకే పాల్పడుతుండడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అవన్నీ నాణ్యతగానే ఉంటాయని మోసపోయి కొనుగోలు చేసుకున్న వినియోగదారులు వాటిని తిని ఎంతటి అనారోగ్యం పాలవుతున్నారోననే భయాందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అసలే ఒకపక్క జనం కరోనా వైరస్ ఎక్కడ తమ ప్రాణాలు తీస్తుందోనని భయపడుతుంటే, ఇదే అదనుగా కొందరు వ్యాపారులు కేవలం ధనార్జనే ధ్యేయంగా చెడిపోయిన పండ్లు వగైరాలను అమ్మేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేస్తున్నారు. ఎంత పెద్దమొత్తంలో జరిమానాలు విధించినా, ఎన్నిరకాలుగా హెచ్చరిస్తున్నా వారు అధికారుల హెచ్చరికలను ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. ప్రభుత్వం ఇలాంటి మోసపు వ్యాపారులను కఠినంగా శిక్షించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.

# ఉన్నాడు... విన్నాడు... చేశాడు!

**మేనిఫెస్టోలో 90శాతం హామీలను అమలుచేసిన ఘనత జగన్‌దే - ఎమ్మెల్యే ప్రసన్న**



ఏడాదిపాలనలోనే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 90 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గతనెల 31న కొడవలూరు మండలంలోని గౌతంనగర్‌లో అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ లాక్‌డౌన్‌లో ప్రజల కష్టాలను పట్టించుకోకుండా హైదరాబాద్‌లో కూర్చొని ట్విట్టర్ వేదికగా చంద్రబాబు విమర్శలు చేయడంలో అర్థం లేదన్నారు. చంద్రబాబు దిగిపోతూ వేలాది కోట్ల రూపాయల బకాయిలను ఇచ్చి వెళ్ళారని, రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో వున్నా సీఎం జగన్ ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తున్నారన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో వేలాది హామీలు గుప్పించి ఒక్కటీ అమలు చేయని చంద్రబాబు జగన్ మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం మాను కోవాలన్నారు. లాక్‌డౌన్‌లో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హఠాత్తుగా ప్రత్యక్షమై పత్రికల్లో విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కరోనా వైరస్‌కు భయపడి హైదరాబాద్‌లో కూర్చొని ప్రజల బాగోగులు మరచిన పోలంరెడ్డి తనను చంద్రబాబుకు క్షమాపణ చెప్పాలని ఎలా డిమాండ్ చేస్తారని ప్రశ్నించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ వీరి చలపతిరావు, వైయస్సార్ సీపీ నాయకులు నాగిరెడ్డి సునీల్, రమేష్, జనార్ధన్, వేణు, శీనయ్య, తహసీల్దార్ లాజరస్, ఎంపీడీఓ జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## రెడ్‌జోన్ ప్రజలకు 'ప్రగతి' సేవ



గూడూరులోని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 2న తమ సంస్థ 70వ కార్యక్రమం, శ్రీకృష్ణ సేవాసమితి 30వ కార్యక్రమం సందర్భంగా 18వ వార్డులోని కోతల రూమ్ రెడ్‌జోన్‌లోని ప్రజలకు 150 కుటుంబాల వారికి వారానికి సరిపడా కూరగాయలను పంపిణీ చేశారు. గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేసు చేతుల మీదుగా వారు ఈ సాయాన్ని అందజేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, సహాయ కార్యదర్శి యమహా సుబ్రహ్మణ్యం, శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మయూరి శ్యామ్, బాలయ్యనాయుడు, ఎం.మస్తానయ్య, గ్రానైట్ ప్రభాకర్, ఉదయ్‌శేఖర్‌రెడ్డి, 18వ వార్డు కౌన్సిలర్ పి.శ్రీనివాసులు, సివిఆర్ న్యూస్ సతీష్, వలంటీర్లు పాల్గొన్నారు.

## రెడ్డి సంక్షేమ సంఘం చేయూత



ఈనెల 2న సనత్‌నగర్, నరసయ్యగుంట గిరిజన కాలనీలో ఉన్న గిరిజన కుటుంబాలకు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేసు చేతుల మీదుగా నిత్యావసర సరుకులను అందజేయడం జరిగింది. ఈ సేవా కార్యక్రమంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, దేవేంద్రరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, సతీష్‌రెడ్డి, గిరి, నరసప్ప, రమణయ్య తదితరులతో పాటు పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

### వలస కుటుంబాలకు
## భోజనం ప్యాకెట్లు పంపిణీ



వలస కార్మికులకు అన్నం ప్యాకెట్లు అందజేస్తున్న రమేష్‌యాదవ్

స్వస్థలాలకు వలస వెళ్తున్న పేదలకు గూడూరు పట్టణం సమీపంలోని జాతీయ రహదారి కూడలి ప్రాంతంలో గూడూరుకు చెందిన సంధ్య, సుదర్శన్‌నాయుడు సహకారంతో వైకాపా నాయకుడు, 27వ వార్డు మాజీ కౌన్సిలర్ బాలిబోయిన రమేష్‌యాదవ్ సుమారు 500 మందికి భోజనం ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌యాదవ్ మాట్లాడుతూ రెండు నెలల నుంచి వలస కార్మికులకు తమవంతు సహకారంగా అన్నం ప్యాకెట్లు, పండ్లు, వాటర్‌బాటిల్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సేవా కార్యక్రమంలో కోదండయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు ఉత్పత్తులను నిషేధించాలి

### - సిగరెట్‌ప్యాకెట్‌లను తగలబెట్టిన జెవివి కార్యకర్తలు



పొగాకు ఉత్పత్తులను నిషేధించి ప్రజల ఆరోగ్యం కాపాడాలంటూ గూడూరులోని జేవీవీ కార్యకర్తలు నినదించారు. మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా పొగాకు, సిగరెట్‌ప్యాకెట్లను వారు తగలబెట్టారు. అనంతరం జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 80శాతం గుండెజబ్బులు సిగరెట్లు తాగడం వల్ల వస్తున్నాయన్నారు. సిగరెట్టు మీరు కాలిస్తే మీ జీవితాలను సిగరెట్లు కాల్చేస్తాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. పేద, మధ్యతరగతివారు ఈ వ్యసనానికి బానిసలవుతున్నారని, యువత సరదాగా మొదలుపెట్టి తర్వాత వ్యసనంగా మారి చివరికి ఊపిరితిత్తులు పాడైపోయి ఆసుపత్రుల్లో చేరి అప్పులపాలవుతూ కుటుంబాలు నాశనమవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పొగతాగడం వల్ల లక్షలాదిమంది చనిపోతున్నారని, సిగరెట్ తయారీసంస్థలు మాత్రం కోట్లకుకోట్లు గడిస్తున్నాయని, ఇకనైనా పొగ తాగడం మాని భావితరాలవారికి ఆదర్శంగా ఉండాలన్నారు. రామ్మోహన్, పురుషోత్తమరావు, మనోహర్ గౌడ్, అశోక్, విష్ణు, గోపి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి

### - ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



కరోనా మహమ్మారి వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, దానిని నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 1న జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ లాక్‌డౌన్ నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలను సబ్‌కలెక్టర్‌తో చర్చించారు. దూర ప్రాంతాల నుంచి, బయటి రాష్ట్రాల నుంచి వచ్చేవారికి వైద్యపరీక్షలు నిర్వహించాలని, కరోనా వ్యాప్తి కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు.

## పేదలకు పలసరుకులు పంపిణీ



గూడూరులోని సిఆర్‌రెడ్డి ఆసుపత్రి, సిఆర్ డిజిటల్ నెట్‌వర్క్, సిఆర్ మార్ట్ సంస్థల దాతృత్వంతో ఎస్టీ కాలనీలో ఉన్న 85 మంది పేదలకు 400 రూపాయల విలువజేసే పలసరుకులను ఒక్కో కుటుంబానికి అందజేసి దాతలు తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో గతనెల 31న ఈ సేవా కార్యక్రమం జరిగింది. డాక్టర్ జనార్దన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని పలసరుకులు అందజేశారు. డాక్టర్ రోహిణి, జీవని, సుప్రియ, విష్ణు వందన, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.



### ముత్యాలమ్మ అమ్మవారి
## ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం



చిల్లకూరు మండలంలోని కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకార కార్యక్రమం గతనెల 29న జరిగింది. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం నియమించిన ధర్మకర్తల మండలి సభ్యులుగా వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, అన్నాడిశెట్టి ధనలక్ష్మి, ఇన్నమాల మస్తానమ్మ, యల్లసిరి పెంచలమ్మ, దువ్వూరు సాయికృష్ణారెడ్డి, కృష్ణాపట్నం మునిలక్ష్మి, ఉప్పాల ప్రభాకర్‌తో పాటు ఎక్స్ అఫిషియో సభ్యునిగా చాకిరి రమణయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డిని మిగిలిన సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆలయ ఇ.ఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, నాయకులు బల్లి కళ్యాణ చక్రవర్తి, వేమారెడ్డి శరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అందరికీ కృతజ్ఞతలు - వేమారెడ్డి

యంగ్ అండ్ డైనమిక్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతో తనను వైకాపాలో చేర్చుకుని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఛైర్మన్‌గా సముచితస్థానం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, తనకు అన్నివిధాలుగా సహాయ సహకారాలందిస్తున్న వైకాపా రాష్ట్ర నాయకుడు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి, జిల్లా ఎమ్మెల్యేలకు, లోక్‌సభ-రాజ్యసభ సభ్యులకు, జిల్లా నాయకులకు ఈ సందర్భంగా వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి తన కృతజ్ఞతలు తెలియజేశారు.

### కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీలో ప్రోత్సాహం - పేర్నాటి

వైకాపా రాష్ట్ర నాయకుడు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వైకాపాలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఎప్పుడూ ప్రోత్సాహం, సముచితస్థానం ఉంటాయన్నారు. కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవన్నారు. కోట మండలంలోని కొత్తపట్నం సమీపంలో అన్యాయంగా నిర్మించ తలపెట్టిన తోళ్ళ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించినందుకు తనను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచారని ఆరోపించారు. ప్రస్తుతం చోటుచేసుకుంటున్న స్థానిక పరిస్థితులకు త్వరలోనే తెరపడే అవకాశం ఉందన్నారు.

## ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



స్వామివారికి పూజలు చేస్తున్న ఆలయ మాజీ ఛైర్మన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, రాజ్యలక్ష్మి

గూడూరు పట్టణంలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గతనెల 31న అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. కరోనా, లాక్‌డౌన్ పరిస్థితుల్లో ఆలయ అర్చకులు, ఉభయకర్తల ఆధ్వర్యంలో అంకురార్పణ వేడుకను నిరాడంబరంగా నిర్వహించారు. వేడుకలను ఆలయానికే పరిమితం చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అనుమతి ఇవ్వకుండా కేవలం అర్చకులు మాత్రమే ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ మాజీ ఛైర్మన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, రాజ్యలక్ష్మిలు పాల్గొని స్వామివారు, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు చేసి వేదపండితుల ఆశీస్సులందుకున్నారు. అనంతరం ఆలయ సిబ్బంది స్వామివార్లకు పల్లకి సేవ నిర్వహించారు.

# కంటైన్మెంట్ జోన్లలో.. లాక్‌డౌన్ తప్పనిసరి

**- జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు**



కంటైన్మెంట్ జోన్లలో తప్పనిసరిగా లాక్‌డౌన్ నిబంధనలు పాటించాలని, కరోనా మహమ్మారి వ్యాధి వ్యాప్తి నివారణకు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అన్నారు. గతనెల 31న నెల్లూరు, స్టోన్‌హౌస్‌పేటలో ఏర్పాటు చేసిన వాణిజ్యసంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన నిబంధనలను కంటైన్మెంట్‌జోన్లలో తప్పకుండా పాటించాలన్నారు. స్టోన్‌హౌస్‌పేటలో రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో ఈ ప్రాంతంలో లాక్‌డౌన్ విధించామన్నారు. ప్రజలు స్వీయనియంత్రణ పాటించాలన్నారు. జూన్ నెలాఖరు వరకు కంటైన్మెంట్ జోన్లలో లాక్‌డౌన్ ఉంటుందన్నారు. కరోనా కేసుల పరిస్థితిని బట్టి ఎప్పటికప్పుడు ఈ పరిస్థితులను సమీక్షిస్తున్నామని, అవసరమైన మార్పు చేర్పులు చేయడం జరుగుతుందని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, ఇన్‌చార్జి కమిషనర్ శీనా నాయక్, డిఎస్పీ శ్రీనివాసులు రెడ్డితో పాటు వైకాపా నాయకుడు ముక్కాల ద్వారకానాథ్, వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు రూప్‌కుమార్ యాదవ్ తదితరులున్నారు.

# బడుగు వర్గాలకు 'జగనన్న చేదోడు'

రాష్ట్రంలోని బడుగు వర్గాల ప్రజలకు సాయంగా 'జగనన్న చేదోడు' కార్యక్రమం చేపట్టి బడుగు బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని రాష్ట్ర బిసి కార్పొరేషన్ ఎం.డి రామారావు తెలిపారు. గతనెల 30న ఆయన కోవూరు మండలంలోని పడుగుపాడు గ్రామంలో సచివాలయం-2ను సందర్శించి అక్కడి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు జూన్ 10వ తేదిన రజకులు, నాయీ బ్రాహ్మణులు, దర్జీలకు 10వేల రూపాయల వంతున అందచేయనున్నారని తెలిపారు. అదేవిధంగా జూన్ 24న వైఎస్సార్ కాపు నేస్తం పథకం కింద కాపు, బలిజ, తెలగ, ఒంటరి తదితర కులాల్లోని మహిళల్లో 50 నుంచి 60 సంవత్సరాలు ఉన్నవారికి ఏడాదికి 15వేల రూపాయల వంతున ఐదేళ్ళ కాలంలో 75 వేల రూపాయలను ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసేందుకు తగు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

ఆయన వెంట జిల్లా బిసి కార్పొరేషన్ ఇ.డి కృష్ణారావు, ఎంపిడిఓ శ్రీహరి, ఇ.ఓ పిఆర్‌డి కల్పన తదితరులు పాల్గొన్నారు.

# ఐఎంఎల్ డిపోల్లో సీఐలు, ఎస్సైల నియామకం

నెల్లూరు జిల్లాలో వున్న నెల్లూరు-1, నెల్లూరు-2 ఐఎంఎల్ డిపోల్లో సీఐలు, ఎస్సైలను కేటాయిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు దేవరపాళెంలో వున్న డిపో-1 ఇన్‌స్పెక్టర్లుగా ఎస్ నీరజ, పీ రమేష్ బాబును నియమించారు. ఎస్సైలుగా షాజహాన్ సాహెబ్, ఎస్‌వీ రాఘవయ్య, ఎం.దేవిక, ఎండీ ఆసిఫ్ బేగ్, పి. శ్రీహరి నియమితులయ్యారు. ఓజిలిలోని నెల్లూరు-2 డిపోలో ఇన్‌స్పెక్టర్లుగా బి.కిషోర్, కె.వినయ్‌కుమార్‌లు, ఎస్సైలుగా ఏవీ నరశింహులు, వి.శ్రీనివాసులు, ఎస్‌కే మహబూబ్‌బాషాలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

శ్రీను గల్పిక 990

# లోకేష్ ఐడియాతో చైనా సైన్యం పరార్

ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం... ప్రధాని నరేంద్ర మోడీ అప్పుడే యోగా, ధ్యానం ముగించుకుని తన గదిలోకి వచ్చాడు. అప్పుడే ఆయన ఫోన్ మోగింది. మోడీ ఎత్తాడు. అవతల నుండి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... హాయ్ ఫ్రెండ్ ఎలా వున్నావ్, అవును మీ బోర్డర్‌లో ఆ చైనా వాడేదో నకరాలు చేస్తున్నాడంట కదా, మా సైనికులను కూడా పంపించమంటావా, ఇద్దరం కలిసి వాడి బెండుతీద్దామని ట్రంప్ అడిగాడు. దానికి మోడీ... భలేవాడివి ట్రంప్... ఈ మాత్రం దానికి మీరు రావాల్నా, ఇలాంటి వాటికి మేం భుజబలం వాడం, బుద్ధిబలాన్ని వాడుతుంటాం, ఒక్కసారి టీవీ ఆన్ చేసి మా రిపబ్లిక్ ఛానెల్ పెట్టిచూడు అని చెప్పాడు. ట్రంప్ మోడీని లైన్‌లోనే పెట్టి ఫోన్ పక్కనపెట్టి టీవీ ఆన్‌చేసి 'రిపబ్లిక్ ఛానెల్' పెట్టాడు. స్క్రీన్‌పై ఇండియా - చైనా సరిహద్దుల్లో సీన్‌లు వస్తున్నాయి. అక్కడ భారతీయ సైనికులెవరూ లేరు. కాని, ఆ బోర్డర్‌లో ఓ వందమంది లావుపాటి వ్యక్తులు మాత్రం చైనా వైపుకు వీపు చూపి 90డిగ్రీల కోణంలో వంగి వున్నారు. వారి వెనుకగా చూస్తే వేలాదిమంది చైనా సైనికులు బ్రతికుంటే బలుసాకు తిని బ్రతకొచ్చన్నట్లుగా ప్రాణభయంతో పరుగులు పెడుతున్నారు. కొందరు స్పృహతప్పి పడిపోతున్నారు. ఆ సీన్ చూసి ట్రంప్‌కు మతిపోయింది. వెంటనే పక్కన పెట్టిన ఫోన్‌ను అందుకుని, లైన్‌లోనే వున్న మోడీతో... ఆ చైనా వాళ్లను ఏం చేశావు ఫ్రెండ్... అక్కడ మీ సైనికులు లేరు, కాల్పులు లేవు, బాంబింగ్ లేదు, అయినా ఆ చైనా వాళ్ళు ప్రాణభయంతో పరుగులు తీస్తున్నారు... అసలేం జరిగింది అని అడిగాడు. దానికి మోడీ ఇది మాటల్లో వర్ణించలేను... నీకొక యూ ట్యూబ్ లింకు పంపిస్తాను... అందులో వున్న సీన్‌లన్నీ చూస్తే విషయం నీకే అర్థమవుతుందని చెప్పి ఒక యూట్యూబ్ లింకు పంపాడు. ట్రంప్ వెంటనే దానిని ఓపెన్ చేశాడు. ఫోన్ స్క్రీన్‌పై సీన్ మొదలైంది.

ప్రధాని కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నిర్మలా సీతారామన్, స్మృతి ఇరాని, ప్రకాశ్ జవదేకర్, పీయుష్ గోయల్, అమిత్‌షా, కిషన్‌రెడ్డి, డిఆర్‌డిఓ ఛైర్మెన్ జి.సతీష్‌రెడ్డిలు వున్నారు. రాజ్‌నాథ్‌సింగ్ వుండి... బోర్డర్‌లో చైనా ఆర్మీ దూకుడు ఎక్కువైంది, వాళ్లు మనపై యుద్ధ సన్నాహాలు చేస్తున్నారు. మనం కూడా భారీగా సైనికులను, యుద్ధ సామాగ్రిని తరలించాలన్నాడు. అందుకు మోడీ... ప్రతిదానికీ యుద్ధమే పరిష్కారం కాదు, ఇలా యుద్ధాలు చేసుకుంటూ పోతే చివరకు ఈ భూమ్మీద మనిషన్నవాడు మిగలడు. చైనా దూకుడును తగ్గించడానికి ప్రత్యామ్నాయం ఆలోచించాలి. తుపాకీ పేలకుండా, బాంబు వాడకుండా, యుద్ధ విమానం లేవకుండా, ఒక్క సైనికుడూ నేలవాలకుండా ఈ సమస్యను పరిష్కరించగల మొనగాడు ఎక్కడో ఒకచోట పుట్టే వుంటాడు అని చెబుతుండగా... కిషన్‌రెడ్డి అప్పుడే టీవీ ఆన్‌చేసి ఏబిసిడి తెలుగు ఛానెల్ పెట్టాడు. అమిత్‌షా అది చూసి... కిషన్, ఈ టీవీ పెట్టకూడదూ, జబర్దస్త్ కామెడీ షో వస్తుంది, ఈ టెన్షన్ సమయంలో కాస్త నవ్వుకుందామన్నాడు. వెంటనే కిషన్‌రెడ్డి అందుకుని... ఎందుకు సార్, ఇందులో మహానాడు లైవ్ వస్తుంది, ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ వుంటుందని చెప్పాడు. దాంతో మోడీతో సహా అందరూ 'ఏబిసిడి' చానెల్‌లో వస్తున్న మహానాడు లైవ్‌ను ఆసక్తిగా తిలకించసాగారు.

అది గుంటూరులోని టిడిపి రాష్ట్ర కార్యాలయం. యువనేత నారా లోకేష్ అప్పుడే అడుగుపెట్టాడు. మూతికి దట్టంగా మాస్క్ కట్టి వున్నాడు. తొలుత బోండా ఉమ కనిపించాడు. అతని మోచేతిని తన మోచేతితో కొట్టి అదొక షేక్‌హ్యాండ్ అన్నట్లు ఫోజిచ్చాడు లోకేష్. ఆ పక్కన కాల్వ శ్రీనివాసులు నిలబడివున్నాడు. అతని తలను తన తలతో గుద్ది, ఇది కొత్త తరహా అభివాదం అన్నట్లు చెప్పాడు. తర్వాత దేవినేని ఉమ కాళ్లను తన కాళ్లతో టచ్ చేశాడు. ఆపైన అచ్చన్నాయుడు నిలబడివున్నాడు. లోకేష్ మనసులో... ఇతనికి కాళ్లు, మోచేతులు, తలతో అభివాదం కరెక్ట్ కాదు అని ఆలోచిస్తుండగా... టక్కున అతనికి అర్జున్ హీరోగా నటించిన 'జంటిల్మెన్' సినిమాలో 'డిక్కిలోన.. డిక్కిలోనా' ఆట గుర్తుకు వచ్చింది, అచ్చన్నాయుడును ఆ టైపులో లోకేష్ విష్ చేశాడు. ఆ పక్కనే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కనిపించాడు. ఇతని ఆకారానికి కాలు, మోచేతులు, తలతో విష్ చేస్తే కళ్లు తిరిగి పడిపోతాడని మనసులో అనుకుని, వీటి కంటే మోకాలు బెటర్ అనుకుని మోకాలితో సోమిరెడ్డి మోకాలిని గుద్దబోయాడు... సోమిరెడ్డి ఆ ప్రయత్నాన్ని వారించి, ఇలాంటివి వద్దులే బాబు, గట్టిగా తగిలితే బ్రెయిన్ దెబ్బతింటుందని చెప్పి తన సీటు వద్దకు వెళ్లిపోయాడు.

ఇదంతా లైవ్‌లో చూస్తున్న మోడీకి టక్కున ఏదో స్ఫురించింది. వెంటనే అమిత్‌షాతో... ఆ లోకేష్ చూడు... మనిషి ఆకారాలకు తగ్గట్లుగా అభివాదాలు చేస్తున్నాడు. అంటే పరిస్థితికి తగ్గట్లుగా వ్యవహరించడంలో ఇతను దిట్ట... కాబట్టి చైనా బోర్డర్ సమస్యకు ఇతనే కరెక్ట్ సొల్యూషన్ ఇవ్వగలడు, వెంటనే అతనిని పిలిపించండి అని ఆదేశించాడు.

సాయంత్రానికల్లా లోకేష్ పిఎంఓ ఆఫీసుకొచ్చాడు. మోడీ చైనాతో బోర్డర్ వివాదాన్ని చెప్పి హింస లేకుండా ఆ సమస్యను పరిష్కరించగలవా అని అడిగాడు. ఇదెంత పని అంకుల్, చిటికెలో చేసేస్తా, కాకపోతే నాకు రెండొందల కిలోల కందిపప్పు, పెసరపప్పు కావాలి అని లోకేష్ అడిగాడు. దానికి మోడీ సరేనన్నాడు.

ఇక్కడితో సీన్‌లు అయిపోయాయి. ట్రంప్ ఆ లింక్ ఆఫ్‌చేసి మళ్ళీ మోడీకి ఫోన్ చేశాడు. మోడీ ఫోన్ ఎత్తగానే... హలో ఫ్రెండ్ కథ క్లైమాక్స్ దాకా వచ్చి ఆగిపోయింది. అసలు సబ్జెక్ట్ రాలేదు. లోకేష్ కందిపప్పు, పెసరపప్పు అడిగాడు. నువ్వు ఇస్తానన్నావు, వాటివల్ల ఏమైంది అని అడిగాడు. అప్పుడు మోడీ... ఆ పప్పుతో లోకేష్ ఒక వంద మానవబాంబులను తయారు చేశాడు. మానవ బాంబులంటే ఐసిస్, తాలిబన్, లష్కర్‌తోయిబా వంటి ఉగ్రసంస్థలు తయారు చేసే మానవబాంబులు కాదు, మా మానవబాంబులు సపరేటు... వీళ్ళు చావరు.. ఇంకొకరిని చంపరు... లోకేష్ తాను సెలక్ట్ చేసిన వంద మంది భారీ కాయులైన వారికి నాలుగురోజుల పాటు ఈ పప్పు ధాన్యాలతో చేసిన పప్పు తినిపించాడు. వాళ్ళ కడుపుల్లో ఆ పప్పు బాగా మరిగి మగ్గిన తర్వాత వారిని బోర్డర్‌లోకి తీసుకెళ్లాం, ముందు జాగ్రత్త చర్యగా అక్కడ మా సైనికులను లేకుండా చేశాం, ఈ భారీ కాయులు బోర్డర్‌లో నిలబడి ఒక్కసారిగా చైనా సైనికుల వైపు తమ కడుపుల్లోని గ్యాస్‌ను వదిలారు... కప్పలు, పాములు, బొద్దింకలు తప్పితే పప్పువాసనలు అలవాటులేని చైనా సైనికులు ఈ పప్పు గ్యాస్ ధాటికి తట్టుకోలేకపోయారు. ప్రాణభయంతో బోర్డర్‌ను వదిలి వంద కిలోమీటర్లు తమ బోర్డర్‌లోపలకు వెళ్లారు. దిస్ క్రెడిట్ గోస్ టు లోకేష్ ఐడియాస్ అని చెప్పాడు. అంతా విన్న ట్రంప్.. మాకూ లోకేష్ లాంటి వాడొకడుంటే ఎంత బాగుండేది అని నిట్టూరుస్తూ ఫోన్ పెట్టేశాడు.

# ప్రభుత్వం పగబట్టింది

- బీద రవిచంద్ర



టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లింపులో వైకాపా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆరోపించారు. ఈనెల 1న నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు చేపట్టిన పనుల బిల్లులు నిలిపివేశారన్నారు. కక్షపూరితంగా అడ్డుకోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనుల బిల్లులు రాని వారికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అండగా ఉంటారని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, ఖాజావలి, సురేంద్రబాబు, సుబ్బానాయుడు, బి.మనోహర్‌రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గంలోని మండలాల నాయకులు పాల్గొన్నారు.

# ఆరు వరుసలుగా తిరుపతి రహదారి

- ఎంపి బల్లి దుర్గాప్రసాద్



నాయుడుపేట-రేణిగుంట రహదారిని ఆరువరుసలుగా విస్తరించనున్నట్లు తిరుపతి ఎంపి బల్లి దుర్గా ప్రసాదరావు పేర్కొన్నారు. ఈనెల 1 న వెంకటగిరి పట్టణంలోని స్పందన కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రోడ్లు విస్తరణ కోసం రూ.1400 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు విశాలంగా మారుతుందని ప్రధాన పుణ్యక్షేత్రమైన తిరుపతికి వెళ్ళేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. రోడ్డు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సమ్మతి తెలిపిందన్నారు. అదేవిదంగా ఏర్పేడు-వెంకటగిరి-పెంచలకోన మార్గంలోని జాతీయ రహదారి మరమ్మత్తులకు రూ.60 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. నాయుడుపేట - రాపూరు రోడ్డుకు రూ.60 కోట్లు, గొల్లపల్లి నుంచి ఓజిలి వరుకు రూ.19 కోట్లుతో రోడ్డును అభివృద్ధి చేస్తామన్నారు. కోవిడ్-19 నివారణలో భాగంగా నెల్లూరు-చిత్తూరు జిల్లాలకు రూ.50 లక్షలు ఎంపీ నిధులు ఇచ్చినట్లు తెలిపారు.

# యస్‌పీయస్‌ఆర్ నెల్లూరుజిల్లా 12వ ఆవిర్భావ దినోత్సవం



నెల్లూరు జిల్లా పేరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నామకరణం చేసి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు కెవి చలమయ్య ఈనెల 4న పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నామకరణం చేసి 12 ఏళ్ళు అయినా ప్రభుత్వ పరంగా అధికారిక కార్యక్రమాలు జరపకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చొరవ చూపి అధికారిక కార్యక్రమంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు లేని శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లాగా, కడప లేని వైయస్ఆర్ జిల్లాగా ప్రకటించి, జీఓ జారీచేయాలని అభ్యర్థిస్తున్నామన్నారు. పొట్టి శ్రీరాములు భవన నిర్మాణానికి భూమి కేటాయించి, శంఖుస్థాపన చేయాలని ఆశిస్తున్నామన్నారు. ఐవిఎఫ్ సభ్యులు ఆర్‌వి శరత్, నగరకంటి రవీంద్ర, సొల్లేటి నాగేశ్వరరావు, సోమిశెట్టి వెంకటరత్నం, రాయవరపు రామకృష్ణ, సతీష్, ఏ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీ నుంచి క్షేమంగా..

# సొంత రాష్ట్రాలకు వలస కార్మికులు



పలు రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం శ్రీసిటీకి వచ్చిన వలస కార్మికులు కరోనా నేపథ్యంలో తమ స్వస్థలాలకు వెళ్ళేందుకు సిద్ధపడగా, వారి కోరిక మేరకు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం, శ్రీసిటీ యాజమాన్యం అందుకు అన్ని ఏర్పాట్లు చేయడంతో ఆ కార్మికులంతా క్షేమంగా తమ రాష్ట్రాలకు చేరుకున్నారు. చివరగా గత నెల 31న పశ్చిమ బెంగాల్‌కు చెందిన 363 మంది ప్రత్యేక బస్సుల్లో చిత్తూరుకు వెళ్ళి అక్కడ నుంచి శ్రామిక్ రైలులో తమ రాష్ట్రానికి బయలుదేరి వెళ్ళారు. స్వగ్రామాలకు చేరుకున్న తర్వాత వారంతా మొదట 14 రోజులు ప్రభుత్వ క్వారంటైన్‌లో, ఆ తర్వాత మరో 14రోజులు హోం క్వారంటైన్‌లో ఉండాలని అధికారులు సూచించారు. ఆ మేరకు తమ రాష్ట్రాలకు వెళ్లేందుకు నమోదు చేసుకున్న 1240 మంది కార్మికులు ఇక్కడి నుంచి స్వస్థలాలకు వెళ్లారు. వారికి ప్రయాణంలో అవసరమైన ఆహారం, మంచినీరు, శానిటైజర్ బాటిల్, మాస్కులను శ్రీసిటీ సిబ్బంది అందించారు. ఈ సందర్భంగా రెండు నెలలపాటు తమ బాగోగులు చూసి అన్ని వసతులు కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి, సిబ్బందికి వలస కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత మళ్ళీ శ్రీసిటీకి వస్తామని వారు తెలిపారు. వలస కార్మికులు సురక్షితంగా తమ స్వస్థలాలకు తరలివెళ్ళడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. వారిని తరలించేందుకు సహకరించిన ప్రభుత్వ యంత్రాంగానికి, ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకోసం శ్రమించిన శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బందిని ఆయన అభినందించారు. కంపెనీల నిర్మాణపనుల్లో వలస కార్మికులే కీలకమని ఆయన అంటూ, వెళ్ళినవారంతా సాధారణ పరిస్థితులు ఏర్పడితే మళ్ళీ శ్రీసిటీకి తిరిగి వస్తామని చెప్పడం తనకెంతో ఆనందం కలిగించిందన్నారు.

**కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ :**

శ్రీసిటీలో ఏళ్ళ తరబడి సుమారు 2వేల మంది వలస కార్మికులు పరిశ్రమల భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కార్మికులపై ప్రత్యేక శ్రద్ధతో శ్రీసిటీ యాజమాన్యం వారికి అవసరమైన సదుపాయాలన్నీ కలుగజేస్తోంది. ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గడ్, జార్ఖండ్, బీహార్, ఒరిస్సా.. ఇలా పలు రాష్ట్రాల కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారు, వీరికి పరిశ్రమల పరిసరాల్లోనే ప్రత్యేకంగా భోజనం, వసతులను శ్రీసిటీ యాజమాన్యం ఏర్పాటుచేసింది. లాక్‌డౌన్ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగంతో పాటు శ్రీసిటీ సెక్యూరిటీ ఇన్‌ఛార్జి రమేష్ తదితరులు వలస కార్మికులను స్వస్థలాలకు పంపడంలో ఎంతగానో కృషిచేశారు.

## మద్యపాన నిషేధంలో..

# మరో ముందడుగు

- జిల్లాలో 43 మద్యం దుకాణాలకు మంగళం



నెల్లూరు జిల్లాలో 43 మద్యం దుకాణాలకు మంగళం పాడేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దశల వారీగా మద్య నిషేధంలో భాగంగా గత ఏడాది 20% దుకాణాలను తగ్గించిన ప్రభుత్వం, ఈ ఏడాది మరో 13% తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో మరో 43 దుకాణాలు మూసివేయనున్నారు. జిల్లాలో మొత్తం 350 దుకాణాలు ఉండగా, 20 శాతం తగ్గించడంతో 280కి చేరాయి. ప్రస్తుతం మరో 13 శాతం తగ్గించడంతో 237 దుకాణాల్లో విక్రయాలు సాగనున్నాయి. అత్యధిక అద్దెలు చెల్లిస్తున్నవి, క్లస్టర్ల వారీగా ఉన్నవి, నామమాత్రంగా విక్రయాలు సాగుతున్న వాటి జాబితా తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదించారు. వాటిని పరిశీలించిన అనంతరం నెల్లూరు ఎక్సైజ్ జిల్లా పరిధిలో 25, గూడూరు ఎక్సైజ్ జిల్లా పరిధిలో 18దుకాణాలను గుర్తించారు.

నెల్లూరు ఎక్సైజ్ జిల్లా పరిధిలో నెల్లూరు నగరంలోని జేమ్స్ గార్డెన్, బీవీ నగర్, సుబేదారుపేట, శెట్టిగుంట రోడ్డు, బుజబుజనెల్లూరు, ముత్తుకూరు, పంటపాళెం, కలిగిరి కొండాపురం రోడ్డు, కావలి ట్రంకురోడ్డు, కావలిలో పెద్దపవని రోడ్డు, కోవూరులోని సాలు చింతల సెంటరు, అల్లూరులో వాటర్ ట్యాంకు సెంటర్, బుచ్చిరెడ్డిపాళెంలో ముంబాయి రోడ్డు, రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు, ఉదయగిరిలో(షాపు నెం.9278), మర్రిపాడు మండలంలో చిన్నమాచనూరు, మర్రిపాడు గ్రామం, వింజమూరులో కావలి రోడ్డు (రెండు దుకాణాలు), టీపీ గూడూరు మండలంలో మహాలక్ష్మీ పురం, ఆత్మకూరులో ఎల్ ఐసీ కార్యాలయం సమీపంలో, బేతపాడురోడ్డు, కలువాయిలో పాత ఎస్ బీఐ రోడ్డు, చేజర్లలో చాకలి వీధి, పొదలకూరురోడ్డులో బస్టాండ్ సెంటర్‌లోని దుకాణాలు, గూడూరు ఎక్సైజ్ జిల్లా పరిధిలో గూడూరు గ్రామీణ మండలం పరిధిలోని పోటుపాళెం, చిల్లకూరు గ్రామం, గూడూరు ఎన్‌ఆర్‌ఏ టాకీస్ సమీపంలో, గూడూరు ముత్యాలపేట, వాకాడు మండలంలో తూపిలిపాళెం, దుగరాజుపట్నం, కోట, సూళ్ళూరుపేట 2,5,8 వార్డుల్లో, తడలో టీవీ నగర్, తడ కారూరుమిట్ట, రామాపురం, నాయుడుపేటలో ఎల్ సాగరం, వెంకటగిరి రోడ్డు, డక్కిలిలో దేవుడు వెల్లంపల్లి రోడ్డు, వెంకటగిరిలో కుమ్మరిమిట్ట, సైదాపురం గ్రామాల్లోని దుకాణాలు మూతపడనున్నాయి.

# కళ్ళాలేస్తున్న కోర్టులు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే, 2019 మే 23న ఆ తీర్పుకి అధికార ఆమోదముద్ర పడింది. 2019 మే 29న అయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాడు.

ప్రజాసంకల్ప యాత్ర ద్వారా 3000 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను స్వయంగా చూసి తాను అధికారంలోకి వస్తే చేపట్టవలసిన ప్రధాన సంక్షేమ పథకాలకు 'నవరత్నాలు' అన్న పేరు పెట్టి ఆ నవరత్నాలనే ఎన్నికల మేనిఫెస్టోగా ప్రచారంచేసి ప్రజాక్షేత్రంలో అజేయుడుగా నిలిచాడు జగన్మోహన్‌రెడ్డి.

వచ్చిన ఏడాదిలోపే నవరత్నాలలో ఒక్కొక్క రత్నాన్ని ప్రజలకు అందిస్తూ చెప్పినవి చెప్పినట్లుగా చేసుకుంటూ ముందుకు పోతున్నాడు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మేధావులకు సైతం అంతుపట్టని అయోమయ స్థితిలో వున్నప్పటికీ జగన్ మాత్రం తొణకకుండా బెణకకుండా తాను చెప్పినవన్నీ చేసేస్తున్నాడు.

### ఇక్కడివరకు అంతా బాగానే వుంది....

జగన్ వ్యవహార శైలి ప్రజల చేత చప్పట్లు కొట్టిస్తుంటే న్యాయ వ్యవస్థ మాత్రం ఆయన పాలన పట్ల అయన ప్రభుత్వం ఇస్తున్న జి.ఓల పట్ల అసంతృప్తితో వ్యవహరిస్తూ వరుసగా చీవాట్లు పెడుతూనే వుంది.

ఉదాహరణకు కొన్ని సంఘటనలు తీసుకుంటే ప్రభుత్వ బళ్లలో ఆంగ్ల మాధ్యమం, పంచాయతీ, గ్రామ సచివాలయాలకు పార్టీ రంగులు, డాక్టర్ సుధాకర్ ఉదంతం, ఏబి వెంకటేశ్వరరావు పునర్నియామకం, నిమ్మగడ్డ రమేష్ వ్యవహారం వంటివి ప్రధాన అంశాలుగా మనం తీసుకోవచ్చు.

### ఆంగ్ల మాధ్యమం...

ప్రభుత్వం నిర్వహించే అన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియాన్ని ప్రారంభించాలన్న జగన్ నిర్ణయానికి విశేష జనామోదం లభించింది. అయన ఆలోచనా విధానాన్ని జనం చప్పట్లతో దీవించారు, కానీ ఇక్కడ అనేక తెలుగు సంఘాలు, రాజకీయ పార్టీలు ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించాయి, తెలుగు రాష్ట్రంలో తెలుగే లేకుండా చేయడం మూర్ఖపు నిర్ణయం అంటూ గగ్గోలుపెట్టాయి. చివరకు వ్యవహారం కోర్టువరకు వెళ్ళింది. న్యాయ వ్యవస్థ కూడా ఈ ఆలోచనను తప్పు పట్టింది. పిల్లల ఇష్టా ఇష్టాలను నిర్ణయించడానికి మీరెవరు అంటూ చీవాట్లు వేసింది, అయితే ఇక్కడ ఇంతటి జనామోదం కలిగిన విషయాన్ని కోర్టుకు అర్థమయ్యేలా చెప్పడంలో జగన్ ప్రభుత్వం విఫలమయ్యింది. గ్రామ స్థాయినుండి నగర స్థాయి వరకు ఇంగ్లీష్ మీడియం నిర్ణయాన్ని ముక్తకంఠంతో ప్రజలు సమర్థిస్తున్నారన్న వాదనను సక్రమంగా న్యాయస్థానంలో వినిపించలేకపోయింది. ఆంగ్ల మాధ్యమం పెట్టినా తెలుగుకి ఏ లోటూ రానీయం అని చెప్పుకోలేకపొయ్యింది.

### ఒకే రంగులు....

అన్ని సచివాలయాలకు ఒకే రంగులు వేసి వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టాలన్న ఆలోచన జగన్ సర్కారు చేసిన మరో ప్రయత్నం. పాలనా పరమైన భవనాలు ప్రజలని చైతన్యవంతం చేసేవిగా, వాటికి ఒక ప్రత్యేక గుర్తింపును తేవాలన్నది బహుశా వారి ఆలోచన కాబోలు. ఇక్కడ అధికారుల అవగాహనా లోపం కావచ్చు లేక పార్టీ నేతల అత్యుత్సాహం కావచ్చు ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులు వేసి మరోసారి తప్పులో కాలేసింది జగన్ సర్కార్. ఒకే రంగులు ఉండాలన్న నిర్ణయం తీసుకున్నప్పుడే ఆ రంగులు వివాద రహితంగా రాజకీయాలకు అతీతంగా ఉండాలన్న కనీస ఆలోచన జగన్ పార్టీ శ్రేణులు కానీ లేదా అయన సర్కార్ యంత్రాంగం కానీ చేయకపోవడం ఆశ్చర్యం. ఈ వివాదం సైతం కోర్టుకు ఎక్కడంతో మళ్ళీ అక్కడ ప్రభుత్వానికి చుక్కెదురయ్యింది. తాను చేసిన పనిని సమర్థించుకోవడంలో జగన్ యంత్రాంగం ఫెయిల్ కావడంతో తాజాగా సుప్రీం కోర్టులో సైతం తల వాచే చీవాట్లు తప్పలేదు.

### అధికారుల బదిలీలు తొలగింపులు...

ఇక మరో అంశం తీసుకుంటే ప్రస్తుతం డాక్టర్ సుధాకర్ ఉదంతం జగన్ సర్కారుకి పెద్ద తలనొప్పిగా తయారయ్యింది. అయన ఎక్కడో ఏదో మాట్లాడాడని ఆయనకు చంద్రబాబు ఏజెంటుగా ముద్ర వేసి ఆయనను విధులనుండి తొలగించారు, అక్కడితో ఆగకుండా సామాజిక మాధ్యమాలలో వైసిపి శ్రేణులు సుధాకర్‌ని తెలుగుదేశంపార్టీ తీవ్రవాదిగా చిత్రీకరిస్తూ ప్రచారం చేశారు, తరువాత జరిగిన సంఘటనతో సుధాకర్‌ని అరెస్టు చెయ్యడం, గోటితో పోయేదానికి గొడ్డలి దాకా తెచ్చినట్లయ్యింది పరిస్థితి.

ఏబి వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ల విషయంలో కూడా జగన్ సర్కార్ తొందరపాటు చర్యలకి దిగింది. కోట్ల మంది జనం వున్న రాష్ట్రంలో ఇలాంటివన్నీ చిన్న చిన్న వ్యవహారాలుగా కనిపిస్తాయి, ప్రభుత్వ అధికారులన్నప్పుడు ఆయా ప్రభుత్వ పెద్దలకు అనుకూలంగా పని చేయడం సర్వ సాధారణమే.

కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డప్పుడు తమకు అనుకూలంగా లేని వారిని ప్రాధాన్యత లేని సీట్లల్లో కూర్చోబెట్టడంకూడా తరచూ జరిగేదే, అయితే ఇక్కడ జగన్ సర్కారులోఉన్న సలహాదారుల అవగాహనాలోపం కావచ్చు లేదా అత్యుత్సాహం కావచ్చు అయన తీసుకునే ప్రతీ నిర్ణయం కోర్టు ముంగిళ్లలోకి వెళ్లి అభాసుపాలైపోతుంది. ఇలాంటి వ్యవహారాలు ప్రజలని కూడా ఆలోచింప చేస్తాయి, ప్రతిపక్షాలకు అవకాశాలు కల్పిస్తాయి.

భవిష్యత్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని ప్రజల అకౌంట్లలోకి నేరుగా ప్రభుత్వ ధనాన్ని జగన్ సర్కారు బదిలీ చేసినా కోర్టులలో ఆయనకు ప్రతివిషయంలోనూ చుక్కెదురు కావడం ప్రజలను ఆలోచింపచేస్తుందనడం మాత్రం తథ్యం.

### వై.యస్. హయాంలో ఇలా జరిగేది కాదు...

ఈ మొత్తం వ్యవహారాలను గమనించి గత ప్రభుత్వాలతో మరీ ముఖ్యంగా వైయస్ రాజశేఖర్‌రెడ్డి పరిపాలనా కాలంతో పోల్చిచూస్తే ముఖ్యమంత్రి హోదాలో జగన్ తీసుకునే నిర్ణయాలు మరింత ప్రజా ప్రయోజనకరమైనవి అయినప్పటికీ వాటిని అడ్డుకోవడానికి ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ముందుగానే పసిగట్టి నియంత్రించడంలో జగన్ సలహా దారులు విఫలమవుతున్నారు. ఇలాంటి కుట్రలు అప్పట్లో వైయస్ పరిపాలనలో కూడా చాలానే జరిగాయి, వాటిని ముందుగానే కనిపెట్టి విషయాన్ని కోర్టువరకు వెళ్లనీయ కుండా కొన్నిటిని మేనేజ్ చేస్తే, కోర్టుకి వెళ్లిన తరువాత కూడా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని, పరిష్కరించుకోవడంలో వైయస్ కొటరి పనిచేసేది. అటు రాజకీయాలతోను ఇటు ప్రభుత్వంతోనూ సంబంధంలేని ఒక బలమైన వ్యక్తిగత బృందం రాజన్నకోసం పనిచేసేది. అలాంటి వారు ఇప్పుడు జగన్‌కి దరిదాపుల్లో కూడా ఉన్నట్లు లేదు.

ఇప్పుడున్న వారు సంయమనం పాటించి వ్యవహారమేదయినా గుట్టుచప్పుడు కాకుండా చక్కబెట్టే పని పక్కనపెట్టి సవాళ్లకు ప్రతి సవాళ్లను విసిరి, గోరంతను కొండంతచేసి అటు ప్రభుత్వాన్ని, ఇటు పార్టీని ఇరుకున పడేస్తున్నారు. లౌక్యంతో పరిష్కరించాల్సిన సమస్యను రాద్ధాంతం చేసి రచ్చకీడ్చి పరువు పోగొట్టుకుంటున్నారు. ఇలా ప్రతి విషయంలోనూ ప్రభుత్వ నిర్ణయాలకు కోర్టులు కళ్లెం వేయడం శుభప్రదం కాదు. ఇప్పటికైనా మునిగిపోయిందిలేదు, జగన్ శ్రేయోభిలాషులమని చెప్పుకునేవాళ్ళు వెంటనే కళ్ళు తెరిచి వైయస్ ఆచరించిన విధానాలు అమలుచేసి, వివాద రహితంగా సమస్యలకు విరుగుడు కనుక్కుంటే... ఇలా 53 కేసుల్లో వ్యతిరేక తీర్పు వచ్చినట్లుగా భవిష్యత్తులో జరగకుండా చూసుకోవచ్చు. ఇక్కడ బలాబలాల ప్రదర్శన, నువ్వెంత అంటే నువ్వెంత అనే వాదం కన్నా... అనుకున్న పనిని ఎలాంటి ఇబ్బంది లేకుండా జరుపుకోవడమే అజెండాగా జగన్ కొటరీ పనిచేస్తే అన్నీ విజయాలే.

వాదోపవాదాలు, విమర్శ, ప్రతివిమర్శలు రాజకీయాలలో పనికొస్తాయి కానీ పరిపాలనలో కాదు. ఇక్కడ కావలసింది సమర్థత, సమన్వయం, సమయస్ఫూర్తి.

# డప్పు కళాకారులను ఆదుకోవాలి

**- డిప్యూటీ డైరెక్టర్‌కు పూర్ణప్రకాష్ వినతి**



రాష్ట్రంలోనే డప్పు కళాకారులకు నిలయమైన నెల్లూరు జిల్లాలో కళాకారులు అంతరించి పోతున్నారని జిల్లా కలెక్టర్ స్పందించి ఆదుకోవాలని కోరుతూ ఏపీ దళిత సేన రాష్ట్ర కార్యదర్శి అరవ పూర్ణప్రకాష్ ఈనెల 2న నెల్లూరు కొండాయపాలెం గేటు వద్దనున్న డిప్యూటి డైరెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పూర్ణప్రకాష్ మాట్లాడుతూ డప్పు కళాకారులకు సంబంధించిన పెన్షన్ కోసం ఆన్‌లైన్ నమోదు చేయాలని, వృద్ధాప్య పెన్షన్ నుండి డప్పు కళాకారులకు పెన్షన్ అందజేయాలని కోరారు. జిల్లాలోని ఐదు డివిజన్లలో వున్న ప్రతి కళాకారుడికి పదివేల రూపాయలు చొప్పున అందజేయాలని డిమాండ్ చేశారు. దళిత సేన, దళిత విద్యార్థి సేన, దళిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మనమే మేలు

(మొదటి పేజీ తరువాయి)

బ్రహ్మాండంగా పనిచేస్తోంది. తెలంగాణలో మొన్నటివరకు కేవలం లక్షణాలు కనిపించిన వారికి మాత్రమే కరోనా టెస్ట్‌లు చేస్తూ కేసులు తక్కువగా చూపించారు. కరోనా నియంత్రణలోకి వచ్చేసినట్లేనని, మరోవారంలో తెలంగాణ కరోనా ఫ్రీ స్టేట్ అవుతుందంటూ మంత్రి కేటీఆర్ ప్రకటనలు కూడా చేశాడు.

కాని ఇప్పుడు చూస్తే ఏమైంది. కరోనా కేసులు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. కరోనా పాజిటివ్ వచ్చినవాళ్ళకే కాకుండా, వాళ్ళ కాంటాక్ట్‌ను గుర్తించడం, వారిని క్వారంటైన్ చేయడం, పరీక్షలు నిర్వహించడం వంటివి చేయకపోవడం వల్ల తెలంగాణలో కేసులు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. ఈ కేసులను కంట్రోల్ చేయలేమంటూ తెలంగాణ ప్రభుత్వం చేతులెత్తేస్తోంది. తెలంగాణ సీఎం, మంత్రుల మాటలు కోటలు దాటినట్లుగా, కరోనా వైరస్ తెలంగాణ దాటడం లేదు.

మాటలు మితంగా మాట్లాడినా కరోనా వైరస్‌ను నియంత్రించే క్రమంలో ఏపి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితోనే వ్యవహరిస్తున్నాడు. దక్షిణ కొరియా నుండి నేరుగా ట్రూనాట్ టెస్ట్ కిట్‌లను తెప్పించి, రాష్ట్రంలో టెస్ట్‌లు పెంచాడు. లక్షణాలు వున్న వారికే కాకుండా వారి సంబంధీకులకు కూడా పరీక్షలు నిర్వహిస్తుండడం, క్వారంటైన్ చేస్తుండడం ద్వారా కరోనాను కట్టడి చేసే ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. ఏ విధంగా చూసినా కరోనా కట్టడిలో మనమే మేలు. కరోనాలోనే కాదు, వలస కూలీలను ఆదుకోవడంలోనూ, లాక్‌డౌన్ కాలంలో కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలోనూ జగన్ తనకు తానే సాటి అనిపించుకుంటున్నాడు. కాబట్టే సర్వేలలో సైతం ఎంతో అనుభవమున్న సీఎంలను వెనక్కినెట్టి దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన ముఖ్య మంత్రులలో నాలుగో స్థానంలో నిలిచాడు. తద్వారా కేసీఆర్‌లా ఇతను మాటల ముఖ్యమంత్రి కాదు, చేతల ముఖ్యమంత్రి, ప్రజల ముఖ్యమంత్రి అని అనిపించుకుంటున్నాడు.

# చేసింది విమర్శ!

(మొదటి పేజీ తరువాయి)

పాలిమర్స్ బాధితులను పరామర్శించి వస్తానని! రెండు ప్రభుత్వాలు కూడా అనుమతినిచ్చాయి. అదిగో సింహం ఏపిలో అడుగుపెడుతోంది అంటూ తెలుగు దేశం వీరాభిమానులు వీరంగం చేశారు. రెండు నెలల తర్వాత చంద్రబాబు రాష్ట్రంలో అడుగుపెట్టాడు... భౌతిక దూరం లేదు వంకాయ లేదు అన్నట్లుగా తెలుగుదేశం కార్యకర్తలు లాక్‌డౌన్ నిబంధనలు కాలరాచి, చంద్రబాబు వున్న చోట కరోనా వైరస్ రాదన్నట్లుగా గుంపులు గుంపులుగా చేరి ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత విజయవాడ చేరి ప్రభుత్వంపై విమర్శలు చేశాడు. ఎన్టీఆర్ జయంతి రోజున జూమ్‌యాప్ ద్వారా పైసా ఖర్చు లేకుండా మహానాడును కూడా ముగించేసి హైదరాబాద్‌కు చెక్కేశాడు. ఆయన వచ్చింది, ప్రభుత్వాలు పర్మిషన్ ఇచ్చింది విశాఖపట్నంకు వెళ్లడానికి. కాని ఆయన జరుపుకుని పోయింది మహానాడు. చంద్రబాబుకు పార్టీ పట్ల వున్న శ్రద్ధ ప్రజలపట్ల లేదనడానికి ఇంతకంటే ఏం ఉదాహరణ కావాలి!



# తెరచుకోనున్న శ్రీహరి ద్వారాలు

## పరిమితంగా దర్శనాలు

బ్రహ్మంగారు తన కాలజ్ఞానంలో తిరుమల శ్రీవారి ఆలయాన్ని నాలుగు రోజులపాటు మూసేస్తారని చెబితేనే... అలాంటి పరిణామం జరుగుతుందా? అని మనమంతా సందేహించాం. ఇప్పుడు బ్రహ్మంగారు చెప్పినట్లు నాలుగు రోజులు కాదుకదా దాదాపు 80రోజుల పాటు తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తులకు దర్శనాలు నిలిపివేయడం జరిగింది. అసలు నిత్య కళ్యాణం, పచ్చ తోరణంగా విరజిల్లే తిరుమలలో 80రోజుల పాటు భక్తులు లేని నైరాశ్య వాతావరణం నెలకొంటుందని ఏ ఒక్కరూ కలలో కూడా వూహించివుండరు.

అసలు తిరుమల అంటే అదొక ప్రత్యేక ప్రపంచం... ఆధ్యాత్మిక లోకం. ప్రకృతి మయం. ప్రకృతిలోనే కనిపించే దైవం. నిత్యం గోవిందనామస్మరణం... లక్షలాది మంది భక్తుల ఆగమనం... తిరుమలలో గడపడం అంటేనే పుణ్య ఫలం.. అలాంటి ఆధ్యాత్మిక క్షేత్రంలో 80రోజుల పాటు నిశ్శబ్ద వాతావరణం నెలకొనడం వూహించని పరిణామం, కరోనా వైరస్ - లాక్‌డౌన్ ప్రభావం శ్రీవారికీ తగిలింది. ఒకరకంగా కరోనా వైరస్ మూలంగా ఆ ఏడుకొండలవాడు కూడా ఈ 80రోజులూ టైంకు తిని, టైంకు పడుకుని కరోనా సెలవులను బాగానే ఎంజాయ్ చేశాడని మనం కూడా సంతృప్తి పడొచ్చు.

కాగా, సుదీర్ఘ విరామం తర్వాత ఈ నెల 8వ తేదీన కలియుగ వైకుంఠం తిరుమలగిరి శ్రీవారి ద్వారాలు తెరుచుకోబోతున్నాయి. 80రోజులుగా శ్రీవారి దర్శన భాగ్యం లేక ఎంతోమంది భక్తులు నైరాశ్యంలో వున్నారు. వారందరికీ ఇదొక ఆధ్యాత్మిక కానుక. అయితే గతంలోలాగా ఒకరోజులో 50, 60వేల మంది దాకా భక్తులకు దర్శన భాగ్యం కలిగే అవకాశం లేదు. భౌతికదూరం వంటి లాక్‌డౌన్ నిబంధనలు అమలుచేయాల్సి రావడంవల్ల రోజుకు ఆరేడు వేల మంది భక్తులకు మించి దర్శన భాగ్యం కలగకపోవచ్చు. కరోనా వైరస్ పూర్తిగా అదుపులోకి వస్తేనేగాని తిరుమలకు మునుపటి ఆధ్యాత్మిక వైభవం రాదు.


# ఇద్దరు మంత్రుల విస్తృత పర్యటన



రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు ఈ నెల 3వ తేదీన కావలి, నెల్లూరు నగర నియోజకవర్గాలలో విస్తృతంగా పర్యటించారు. కావలి మండలంలోని మద్దూరుపాడులో మంత్రులిద్దరూ ఐస్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. అనంతరం బోగోలు మండలం జువ్వలదిన్నెకు చేరుకుని బోటులో వెళ్లి ఫిషింగ్ హార్బర్ నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే అల్లూరు మండలంలోని ఇస్కపల్లిలో ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్‌ను సందర్శించి అక్కడ పనుల పురో గతిపై అధికారులతో సమీక్షించారు. దగదర్తి మండలంలో డిఎం ఛానల్ ద్వారా దగదర్తి, బోగోలు, కావలి మండలాలలో 17 చెరువుల ఆయకట్టు స్థిరీకరణ పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రులు నెల్లూరు చేరుకున్నారు. డైకస్ రోడ్డులోని చేపల మార్కెట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమాలలో వారివెంట కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, మాజీఎంపి బీద మస్తాన్‌రావు, జిల్లా కలెక్టర్ ఎం.వి. శేషగిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కరోనా కోర్టులో..

# దోషి చైనానే!



- ప్రపంచాన్ని నిలువునా వంచించింది

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాటల్లో, చేతల్లో విచిత్రంగా కనిపిస్తాడుగాని, కొన్ని విషయాలలో ఆయన వైఖరే కరెక్ట్ అనిపిస్తుంది. ప్రపంచాన్ని నిలువునా స్థంభింప చేసిన కరోనా వైరస్ విషయంలో ఆయన మొదటినుండి ఒకే వైఖరితో వున్నాడు. ఈ వైరస్‌ను సృష్టించింది చైనాయే అన్నది ఆయన వాదన. కరోనా చైనా సృష్టి అంటూ ట్రంప్ ఆరోపణలు చేయడమేకాక, దీనిపై విచారణ కూడా మొదలుపెట్టించాడు. అంతేకాదు, చైనాకు వత్తాసు పలుకుతూ కరోనా వైరస్ విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించిందని, ప్రపంచ ఆరోగ్య సంస్థతో తాము తెగదెంపులు చేసుకుంటున్నట్లు కూడా ఆయన ప్రకటించడం తెలిసిందే!

తొలినాళ్ళలో అందరూ ట్రంప్‌వి తొందరపాటు చర్యలని అనుకున్నారు. కాని కాలక్రమంలో ట్రంప్ అనుమానాలే నిజమవుతున్నట్లుగా వుంది. గత ఏడాది డిసెంబర్‌లో వూహాన్ నగరంలో అర్ధంకాని న్యుమోనియాతో పలువురు రోగులు ఆసుపత్రులలో చేరారు. వారి నమూనాలను పరిశీలించిన విజన్ మెడికల్స్ అనే సంస్థ సార్స్‌ను పోలిన కొత్త వైరస్ మానవ సమాజంపై దాడి చేయబోతుందని గుర్తించింది. వూహాన్ నగరంలోని పి-జెంగ్లీ అనే వైరాలజిస్ట్ ఈ ఏడాది జనవరి 2వ తేదీకల్లా వైరస్ జన్యువును డీకోడ్ చేయగలిగారు. ఇది అంటువ్యాధి కావొచ్చని పి-జెంగ్లీ ప్రభుత్వానికి నివేదించారు. చైనాలోని మరో రెండు ల్యాబ్‌లు కూడా వైరస్ జన్యువును డీకోడ్ చేశాయి. కాని, ఈ సమాచారాన్ని ప్రపంచంతో పంచుకోవడానికి చైనా ఇష్టపడలేదు. తమ అనుమతి లేకుండా ఈ వైరస్ సమాచారం బయటకు పోకూడదంటూ చైనా జాతీయ ఆరోగ్య కమిషన్ ఆదేశించింది. చైనా ల్యాబ్‌లలో జన్యువును డీకోడ్ చేసిన సమాచారాన్ని ప్రపంచానికి ఇచ్చివుంటే ఇంకా ముందుగా వ్యాక్సిన్, ఔషధాలు కనిపెట్టడానికి, ప్రపంచం అప్రమత్తం కావడానికి అవకాశముండేది.

అమెరికాకు చెందిన అసోసియేషన్ ఆఫ్ ప్రెస్ సేకరించిన సమాచారం ప్రకారం కరోనా వైరస్ విషయంలో చైనా, దాని నమ్మిన బంటుగా పనిచేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థలు ప్రపంచాన్ని పూర్తిగా తప్పుదోవ పట్టించాయి. కరోనా వైరస్ విషయంలో డబ్ల్యుహెచ్ఓ లోతైన దర్యాప్తు చేయలేకపోయింది. చైనా ఏది చెబితే దానినే ప్రపంచ దేశాలకు చెప్పింది. డబ్ల్యుహెచ్ఓ చెప్పిన దానినే ప్రపంచ దేశాలన్నీ నమ్మాయి. జనవరి ఆఖరివరకు ఇది మనిషి నుండి మనిషికి సోకే వైరస్ కాదని డబ్ల్యుహెచ్ఓ చెప్పడంతోటే అన్ని దేశాలు కూడా ఈ వైరస్ మాకు రాదన్నట్లు నిమ్మకు నీరెత్తినట్లు వుండిపోయాయి. వైరస్ అన్ని దేశాలకూ పాకడం మొదలుపెట్టాకగాని ఈ లోకంలోకి రాలేకపోయాయి!

ఏ వైరస్ అయినా సహజంగా ఏర్పడడం, విస్తరించడం సాధారణం. కాని, కరోనా వైరస్‌ను మాత్రం చైనా తన స్వార్ధానికి వాడుకుంది. కరోనా వైరస్ మూలంగా ఈరోజు ప్రపంచం ఇంతగా నష్టపోవడానికి కారణం చైనానే! తన ప్రత్యర్ధి దేశాలను అన్ని విధాలా దెబ్బ తీయాలన్న కుట్రతోనే చైనా కరోనా వైరస్‌ను ఒక పావుగా వాడుకుందన్నది నగ్నసత్యం!

# నీళ్ళపై నిప్పులు చెరిగిన ఆనం

***జేబులు నింపిన వాళ్ళకే నీళ్ళు వదులుతున్నారంటూ వెంకటగిరి శాసన సభ్యులు ఆనం రామనారాయణరెడ్డి నిప్పులు చెరిగాడు. 3వ తేదీ వెంకటగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జిల్లా అధికార యంత్రాంగంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా వుండి ఆయన చేసిన విమర్శలు రాజకీయ వర్గాలలో కలకలం సృష్టిస్తున్నాయి.***

ఆయన అధికారులపైన ఆరోపణలు చేశాడనుకున్నా పరోక్షంగా ఇరిగేషన్ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్‌కే ఆ విమర్శలు ఎక్కుపెట్టినట్లుగా వున్నాయి. అధికార యంత్రాంగం నీళ్ళమ్ముకుంటుందంటూ తీవ్ర ఆరోపణలు చేశాడు. నేనూ అధికారపార్టీ ఎమ్మెల్యేనే! ప్రభుత్వంలో భాగస్వామినే! ఈ జిల్లాలోని 10 అసెంబ్లీలలో వెంకటగిరి కూడా వుంది. మరి ఈ జిల్లా నుండి వెంకటగిరిని తొలగించారా? ఇంకో జిల్లాలో ఏమన్నా కలిపారా? అంటూ ఆయన ప్రశ్నించాడు. 40ఏళ్ల నా రాజకీయ జీవితంలో ఇంతటి దౌర్భాగ్య పరిస్థితులను ఎప్పుడూ చూడలేదు. ఉమ్మడి



ఆంధ్రప్రదేశ్‌లో 3సార్లు మంత్రిగా చేశాను, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి ప్రాతినిధ్యం వహించాను, ఇలాంటి పరిస్థితులను ఎప్పుడూ చూడలేదు. వెంకటగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎన్ని ప్రతిపాదనలు చేసినా అవి అధికారుల వద్దే ఆగిపోతున్నాయని, అభివృద్ధి పనుల విషయంలో అధికారయంత్రాంగం వెంకటగిరి నియోజకవర్గాన్ని చిన్నచూపు చూస్తోందని ఆయన ఆరోపించాడు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కాంట్ కలదు




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com